www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229




సంపుటి : 17 | సంచిక : 225 | శనివారం 17.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## మళ్లీ తెరపైకి డీలిమిటేషన్ మహిళా బిల్లు?



- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం మళ్లీ కసరత్తు
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు కేంద్రం సన్నాహాలు?
- నియోజకవర్గాల పునర్విభజనపై మళ్లీ రాజకీయ వేడి
- రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కొత్త వ్యూహం
- బిల్లుల ఆమోదానికి విపక్షాలతో కేంద్రం సంప్రదింపులు

లోక్‌సభ స్థానాల పెంపుపై మళ్లీ చర్చ

03

## సర్ట్-ఇన్ సంచలన హెచ్చరిక

- భారత సంస్థల రహస్య డేటాపై ఏఐ ఏజెంట్ల కన్ను!
- ఏఐ ఏజెంట్ల అనధికారిక యాక్సెస్‌తో కలకలం
- సైబర్ భద్రతపై 'క్రిటికల్' హెచ్చరిక జారీ
- భారత సంస్థల డేటా భద్రతకు ఏఐ ముప్పు?

02




## వ్యాపారులకు నష్టం జరిగితే ఊరుకోం

- కనాట్ ప్లేస్ మూసివేతపై సుప్రీంకోర్టు సీరియస్
- వ్యాపారుల జీవనోపాధికి నష్టం కలిగిస్తే ఊరుకోం
- కనాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్ మూసివేతపై విచారణ
- ఎన్‌డీఎంసీ ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక హెచ్చరిక
- తిరంగా నిరసనల వేళ ఢిల్లీలో వ్యాపారాలపై ప్రభావం
- ఆంక్షలు అతిగా ఉంటే పరిహారం చెల్లించాల్సిందేనా?

05



# తెలంగాణలో హుందాయ్ భారీ పెట్టుబడి..

## కార్ల తయారీకి హైదరాబాద్ అనుకూలం

జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో హ్యుందాయ్ కేంద్రం

పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా సహకారం

తెలంగాణలో తయారీ రంగానికి మరింత ఊతం



- హ్యుందాయ్ పెట్టుబడులకు తెలంగాణ ఆహ్వానం
- హ్యుందాయ్ ఆర్ అండ్ డీ కేంద్రానికి సహకారం
- 4,276 మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- కార్ల తయారీకి హైదరాబాద్ అనుకూలం
- 678 ఎకరాల్లో హ్యుందాయ్ పరిశోధన కేంద్రం
- హ్యుందాయ్ ప్రతినిధి బృందంతో సీఎం భేటీ
- తెలంగాణలో తయారీ రంగానికి మరింత ఊతం
- ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు హ్యుందాయ్‌కు ఆహ్వానం

03

హ్యుందాయ్ పెట్టుబడులతో ప్రాంతీయ అభివృద్ధికి ఊతం

నిమ్జ్‌లో భారీ వాహన పరీక్షా కేంద్రం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

కార్ల తయారీ పరిశ్రమ స్థాపించడానికి హైదరాబాద్ అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు హ్యూందాయ్ ఇండియా సంస్థకు తెలిపారు. తెలంగాణలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి గారితో హ్యూందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్ఎంఐఈ) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. "భౌగోళికంగా తెలంగాణ దేశంలో మధ్య భాగంలో ఉంది. దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా, అత్యంత సురక్షితమైనదిగా, జీవించేందుకు అత్యంత అనుకూలమైన నగరంగా గుర్తింపు పొందింది" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఇక్కడి సానుకూల పరిస్థితులను వివరించారు. జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ...




## ఎల్‌నినో నేపథ్యంలో నీటి వినియోగంపై అప్రమత్తత

- జూన్ వరకు నీరు, విద్యుత్తు పొదుపుగా వాడాలి
- ఎల్‌నినోతో నీటి ఎద్దడి.. అప్రమత్తంగా ఉండాలి
- నీటి లభ్యతను బట్టి వరి సాగు తగ్గించాలి
- అర్హులందరికీ పక్కా ఇళ్లు అందిస్తాం
- 2,111 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు
- 179 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు
- తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు

02

# జూన్ వరకు పొదుపే మేలు!

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో వచ్చే జూన్ వరకు నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రజలకు సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. రైతులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించాలని రైతులకు సూచించారు.



# పోలీసుల అదుపులో అభిజిత్, నేహా బోరా..

- తిరంగా మార్చ్‌కు ముందే నేతల అరెస్టులు
- కాక్రోచ్ జనతా పార్టీ ర్యాలీకి పోలీసుల అడ్డుకట్ట
- సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే అదుపులోకి
- తిరంగా మార్చ్‌పై ఢిల్లీ పోలీసుల ఆంక్షలు
- నిరసనలకు వెళ్లకుండా విద్యార్థి నేతలకు అడ్డంకులు

03

# విద్యార్థుల నిరసనలపై నిఘా..

- త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం
- వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య చర్చలు
- మాల్దీవులకు రూ.3,000 కోట్ల కరెన్సీ స్వాప్
- మాల్దీవుల ఆర్థిక స్థిరత్వానికి భారత్ చేయూత
- భారత్-అమెరికా ఒప్పందంపై కేంద్రం కీలక ప్రకటన
- యూఏఈతో వాణిజ్యం, ఇంధన రంగాలపై చర్చలు

03





## ఎల్ నినోపై ముందుచూపేది?

రానున్న పది నెలల్లో తీవ్ర నీటి ఎద్దడి

- రైతు కూలీలకు రూ.12 వేల పథకం అమలు చేయాలి
- ఇంకెన్నాళ్లు పాత ప్రభుత్వంపై విమర్శలు
- కృష్ణా ప్రాజెక్టులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం
- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది
- యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

03

# ఒక్క అవకాశం ఇవ్వండి

## తెలంగాణ యువత ఆశయాలు జనసేన సాధిస్తుంది: పవన్ కల్యాణ్

- గడల శ్రీనివాసరావుకు మద్దతివ్వాలని పవన్ కల్యాణ్ పిలుపు
- తెలంగాణ యువత రాజకీయ ఆకాంక్షలకు జనసేన అండ
- గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ ప్రచార రథాన్ని ప్రారంభించిన పవన్
- పట్టభద్రుల సమస్యలు తెలుసుకునేందుకు జనసేన ప్రచార రథం
- తెలంగాణలో జనసేనకు ఒక్క అవకాశం ఇవ్వండి

03




# రాహుల్ గాంధీ దాదాగిరి చేస్తున్నారా?



## అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగొద్దు

ఓటు చోరీ జరగలేదు.. రాహుల్ ఆరోపణలు అవాస్తవం: కిషన్ రెడ్డి

- మోదీ నాయకత్వాన్ని బలహీనపరిచే కుట్రలు
- ఈసీ, ఈవీఎంలపై కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు
- తెలంగాణలో అరెస్టులు.. ఢిల్లీలో ఉపన్యాసాలా?
- కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలపై విమర్శలా?
- ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన కిషన్ రెడ్డి
- డీప్ స్టేట్ కుట్రలో భాగంగానే దుష్ప్రచారం
- రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ దుష్ప్రచారం

03

# సింగరేణి స్కామ్‌పై కేటీఆర్ సవాల్..

విదేశీ బొగ్గు కొనుగోళ్ల వెనుక కమిషన్ల దందా

- సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- రేవంత్‌ది కమీషన్ల కోసమే విదేశీ బొగ్గు కొనుగోళ్లు
- సింగరేణి అక్రమాలపై సీఎం సమాధానం చెప్పాలి
- ఈఎంఐ ముఖ్యమంత్రి అంటూ రేవంత్‌పై కేటీఆర్ ఫైర్
- కాంగ్రెస్ తెచ్చిన కరువుతో రైతులకు కష్టాలు
- సోలార్ స్కామ్‌పైనా సమగ్ర విచారణ జరపాలి

02



రూ.10 వేల కోట్ల స్కామ్‌పై న్యాయ విచారణ జరపాలి

మీడియా ముందు ఆరోపణలు చేయడం కాదని, దమ్ముంటే సింగరేణి కుంభకోణాలు , ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు.

# సర్ట్-ఇన్ సంచలన హెచ్చరిక

**ఢిల్లీ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి సైబర్ సెక్యూరిటీలో కొత్త భయాందోళనలు పుట్టిస్తోంది. ఇటీవల కృత్రిమ మేధ వ్యవస్థ మరో ఏఐ కంపెనీని హ్యాక్ చేసిన ఘటన మరువక ముందే తాజాగా భారతదేశంలోని పలు సంస్థలకు చెందిన రహస్య సమాచారాన్ని ఏఐ ఏజెంట్లు అనుమతి లేకుండా యాక్సెస్ చేయడం కలకలం రేపుతోంది. పరిశోధన, పరీక్షల కోసం వినియోగిస్తున్న ఏఐ ఏజెంట్లు తమకు అప్పగించిన పనుల పరిధిని దాటి వాస్తవ వ్యవస్థల్లోకి ప్రవేశించి, వ్యక్తిగత సమాచారంతో సహా కీలక డేటాను చదివినట్లు భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ తెలిపింది. ఈ ఘటనల నేపథ్యంలో సైబర్ భద్రతపై సంస్థలకు 'క్రిటికల్' స్థాయి హెచ్చరిక జారీ చేసింది.

**కాన్ఫిగరేషన్ లోపాలతో రహస్య సమాచారం లీక్:**

జాతీయ మీడియాలో వెలువడిన కథనాల ప్రకారం ఈ అనధికారిక యాక్సెస్‌ను ప్రభావితమైన ఏ ఒక్క భారతీయ సంస్థ కూడా స్వయంగా గుర్తించలేకపోవడం గమనార్హం. కొన్ని ఏఐ మోడళ్లను అభివృద్ధి చేస్తున్న సంస్థలు స్వచ్ఛందంగా ఈ విషయాన్ని సీఈఆర్టీకి తెలియజేశాయి. ఇంటర్నెట్‌లో పనిచేస్తున్న తమ మోడళ్లు భారతదేశంలోని కొన్ని సంస్థల లైవ్ సిస్టమ్‌లను యాక్సెస్ చేసినట్లు గుర్తించామని వెల్లడించాయి. అప్లికేషన్ కాన్ఫిగరేషన్‌లో బయటపడిన లాగిన్ వివరాలు, పబ్లిక్ కోడ్ రిపాజిటరీల్లో ఉన్న ఆధారాలు, క్లౌడ్ వ్యవస్థల్లో అతిగా అనుమతులు కల్పించిన సెట్టింగ్‌లను ఉపయోగించి ఏఐ ఏజెంట్లు వ్యాపార రికార్డులను చదివినట్లు సీఈఆర్టీ గుర్తించింది. ఈ చర్యలు తమకు అప్పగించిన పనులకు ఇచ్చిన అనుమతుల పరిధిని దాటాయని పేర్కొంది.

**పాత లోపాలనే వేగంగా గుర్తిస్తున్న ఏఐ**

సైబర్ దాడులకు కారణమవుతున్న లోపాలు కొత్తవి కావని సీఈఆర్టీ పేర్కొంది. సోర్స్ కోడ్‌లోనే కీలక యాక్సెస్ వివరాలను ఉంచడం, ఉపయోగంలో లేని లేదా పరీక్షల కోసం ఏర్పాటు చేసిన ఏపీఐలను ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంచడం, పేమెంట్ ఏపీఐ కీలను సాధారణ టెక్స్ట్ రూపంలో భద్రపరచడం, మల్టీ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ లేకుండా అడ్మిన్ ఇంటర్‌ఫేస్‌లను అందుబాటులో ఉంచడం వంటి సమస్యలే ప్రధాన కారణాలని వివరించింది. ఈ లోపాలను ఏఐ సాధనాలు మనుషుల కంటే వేగంగా, విస్తృతంగా గుర్తించి దుర్వినియోగం చేయగలగడమే ఇప్పుడు ప్రధాన సమస్యగా మారిందని హెచ్చరించింది.



# కేంద్ర ప్రభుత్వ స్పందన కోరిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ:** ముస్లిం సమాజంలో ప్రస్తుతం అమల్లో ఉన్న అన్ని రకాల విడాకుల పద్ధతులు, ఇతర వైవాహిక రద్దు రూపాలపై స్పష్టమైన చట్టబద్ధమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం స్పందించింది. అయితే, సదరు పిటిషన్‌పై తమ నివేదికను కౌంటర్‌లా దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం ఇవాళ నోటీసులు జారీ చేసింది. ముస్లిం పర్సనల్ లా కింద అమల్లో ఉన్న వివిధ రకాల తలాక్ పద్ధతులు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు, ముఖ్యంగా మహిళల ఆత్మగౌరవం, సమానత్వపు హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు తలాక్‌ను ఇప్పటికే సుప్రీంకోర్టు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ నిషేధించినప్పటికీ, ఇతర రకాల ఏకపక్ష విడాకుల పద్ధతులు ఇంకా అమల్లో ఉన్నాయని, వీటిని క్రమబద్ధీకరించడానికి, నియంత్రించడానికి యునిఫాం గైడ్‌లైన్స్ అవసరమని పిటిషనర్ కోరింది. ఈ క్రమంలోనే చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం సదరు పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ, ముస్లిం మహిళల ప్రాథమిక హక్కులను పరిరక్షించేలా, అన్ని రకాల విడాకుల ప్రక్రియలో న్యాయమైన విధానం అమలయ్యేలా గైడ్‌లైన్స్ రూపొందించే అంశంపై కేంద్ర చట్ట మంత్రిత్వ శాఖ తమ స్పందన తెలియజేయాలని నోటీసుల ద్వారా కోరింది.

# జూన్ వరకు పొదుపే మేలు!

**అక్బర్‌పేట భూంపల్లి,ఫ్లాష్ ఇండియా :** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో వచ్చే జూన్ వరకు నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రజలకు సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. రైతులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించాలని రైతులకు సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం నగరం శివారులోని శ్రీ రామలింగేశ్వర ఫంక్షన్ హాల్లో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి, రాయపోల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన 2111 లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు, 179 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జిల్లా కలెక్టర్ హైమావతి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తో కలిసి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది అక్టోబరులో 15 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్తు వినియోగం ప్రస్తుతం 20 వేల మెగావాట్లకు చేరిందన్నారు. రాష్ట్రంలో 35 లక్షల బోరుబావుల వినియోగంతో విద్యుత్తు అవసరాలు పెరిగాయని తెలిపారు. రైతులకు రోజుకు 9 గంటల 30 నిమిషాల విద్యుత్తు సరఫరా చేస్తామన్న ప్రభుత్వ హామీని ప్రస్తావించారు.

**అర్హులందరికీ ఇళ్లు..**

సిద్దిపేట జిల్లాలో రెండేళ్లలో 12 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వచ్చే ఏడాది మరో 5,753 ఇళ్లను మంజూరు చేయనుందని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సాగునీరు, విద్యుత్తు అందించి రైతులను ఆదుకోవాలి.

**అర్హులైన లబ్ధిదారులందరికీ పక్కా ఇళ్లు అందేలా చూడాలి: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్ జలాశయాలను నింపకపోవడం, విద్యుత్తు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఏప్రిల్, మే నెలల్లోనూ మల్లన్నసాగర్ ద్వారా కూడవెల్లి వాగు ప్రవహించేదని గుర్తుచేశారు. రైతులకు కనీసం 10--12 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. విద్యుత్తు సమస్యలతో పలు మండలాల్లో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. పక్కా ఇళ్ల పంపిణీలో అర్హులైన వారందరికీ న్యాయం జరగాలని సూచించారు. లబ్ధిదారులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఎంఆర్ఓ, కలెక్టర్ పరిశీలించాలని, గ్రామాల నుంచి వస్తున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, రాష్ట్ర పద్మశాలి చైర్మన్ గూడూరి శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత, కమిషనర్ మహేష్ కుమార్, నియోజకవర్గస్థాయి తహసీల్దారులు మోతి సింగ్, బాలరాజు, దుబ్బాక, మిరుదొడ్డి ఏఎంసీ చైర్మన్ లు కొంగర రవి, బొమ్మర సంయుక్త, పిఎసిఎస్ చైర్మన్ కైలాష్, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం చెరుకు శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ స్థాయి సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, ఆయా పార్టీల నాయకులు పలువురు పాల్గొన్నారు.

# సింగరేణి స్కామ్‌పై కేటీఆర్ సవాల్..

**నర్సంపేట,ఫ్లాష్ ఇండియా :** నర్సంపేట నియోజకవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సింగరేణిలో జరిగిన అక్రమాలు, కుంభకోణాలపై తాము నిలదీస్తే రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మీడియా ముందు ఆరోపణలు చేయడం కాదని, దమ్ముంటే సింగరేణి కుంభకోణాలు , ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. కేవలం బొగ్గు అంశమే కాకుండా, సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన రూ. 10 వేల కోట్ల కుంభకోణంతో పాటు సోలార్ పవర్ స్కామ్‌పై కూడా సమగ్ర న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

**విదేశీ బొగ్గు కుట్ర వెనుక కమిషన్ల దందా**

తెలంగాణలో 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సింగరేణిని పక్కన పెట్టి, విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవడానికి రేవంత్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా టన్ను బొగ్గు రూ. 3,800కి దొరికితే, ఆస్ట్రేలియా తదితర విదేశాల నుంచి కొనుగోలు చేస్తే రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకు ధర పడుతుందని, అక్కడ వచ్చే కమీషన్ల కోసమే ఈ విదేశీ కొనుగోళ్ల డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ హయాంలో సింగరేణి అండతోనే రాష్ట్రంలో 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమైందని, కానీ నేడు రేవంత్ రెడ్డి ఆ సంస్థను బదనామ్ చేస్తూ సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**'ఈఎంఐ' ముఖ్యమంత్రి.. రికవరీ ఏజెంట్లుగా ఏఐసీసీ పెద్దలు**

సీఎం రేవంత్ రెడ్డిని 'ఈఎంఐ ముఖ్యమంత్రి' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఢిల్లీలోని హైకమాండ్‌కు ప్రతి నెలా ఈఎంఐ కట్టకుంటే ఆయన పదవి గల్లంతవుతుందని, అందుకే సింగరేణిని అడ్డంపెట్టుకుని స్కామ్‌లు చేసి ముడుపులు కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రాష్ట్రంలో ఒక రికవరీ ఏజెంట్ లాగా వ్యవహరిస్తూ, రేవంత్ నుంచి కమిషన్లు వసూలు చేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. ఇష్టానుసారంగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు విద్యుత్ కొనుగోళ్ల పేరుతో ఛత్తీస్‌గఢ్ ఒప్పందాలపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. తాము గతంలో రూ. 3.90 కే యూనిట్ కొంటే కుంభకోణమన్న కాంగ్రెస్ నేతలు, నేడు రూ. 15 పెట్టి కొనాలని చూస్తున్న తీరును ఏమనాలని ప్రశ్నించారు.

**ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు**

రాష్ట్రంలో నెలకొన్న తాగు, సాగునీటి ఎద్దడిపై స్పందిస్తూ.. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని కేటీఆర్ విమర్శించారు. ఆరు నెలల ముందే కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోయాలని తాము విజ్ఞప్తి చేసినా, తాను చేసిన తప్పులు బయటపడతాయనే భయంతో రేవంత్ ఆ పని చేయలేదని ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీళ్లు ఎత్తకపోవడంతో వృథాగా పోయాయని, నేడు పంటలు ఎండిపోతుంటే 'ఎల్-నినో' పేరుతో చేతులెత్తేస్తున్నారని దుయ్యబట్టారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జలపండగ చేసుకుంటూ 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం దాకా నీళ్లు తరలించుకుంటుంటే, కేవలం 70 కిలోమీటర్ల దూరంలోని మహబూబ్‌నగర్‌కు కూడా నీళ్లు ఇచ్చుకోలేని చేతకాని స్థితిలో రేవంత్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నారని, రాజకీయాలు పక్కన పెట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మిర్యాలగూడలో ఘనంగా జిఎంఆర్ న్యూరో సైకియాట్రి హాస్పిటల్ ప్రారంభం..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో జిఎంఆర్ న్యూరో సైకియాట్రిస్ట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్), ఎమ్మెల్సీ శంకర్ నాయక్ హాజరై రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా జిఎంఆర్ న్యూరో సైకియాట్రి హాస్పిటల్ డాక్టర్ గట్టుపల్లి నిఖిల్ రెడ్డి ఆధ్వర్యంలో అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. మిర్యాలగూడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఆసుపత్రి సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని, ప్రతి మధ్యతరగతి కుటుంబానికి నిర్వాహకులు అందుబాటు ధరలలో సేవలు అందించాలని సూచించారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ గట్టుపల్లి నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ మన హాస్పిటల్ లో ఈ సిటీ సేవలు,మానసిక కౌన్సిలింగ్,డి అడిక్షన్ సేవలు,డిప్రెషన్,ఓ సి డి,జ్ఞాపకశక్తి సమస్యలు,ఆత్మహత్య ఆలోచనలు కు ఆధునిక సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ,వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి,హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గట్టుపల్లి మల్లారెడ్డి,గట్టుపల్లి రేణుక,యాట శేఖర్ రెడ్డి లతోపాటు పట్టణ లోని వార్డు కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాలి

- తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి
- ప్రత్యేక అధికారి దాసరి హరిచందన
- ఆరుతడి పంటల సాగుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం
- నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్






**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రజలు తాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, పశుగ్రాసం తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కోకుండా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖల కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రత్యేక అధికారి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. రానున్న నాలుగైదు నెలలపాటు ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ పంటల పరిస్థితి, సాగునీరు, తాగునీరు, భూగర్భ జలాలు, విద్యుత్తు సరఫరా తదితర అంశాలపై చర్చించారు. డిసెంబరు చివరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్రస్థాయికి చేరే అవకాశం ఉందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని హరిచందన తెలిపారు. ఈ పరిస్థితులు వ్యవసాయం, భూగర్భ జలాలు, తాగునీటి సరఫరా, విద్యుత్తు తదితర రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి....తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు నీటి లభ్యతపై వాస్తవ పరిస్థితులను వివరించి పొదుపుగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, చివరి గ్రామం వరకు, ప్రతి ఇంటికి నీటిని అందించే మార్గాలను గుర్తించాలని చెప్పారు. భూగర్భ జలాలు, బోర్ల పరిస్థితి, నీటి నిల్వకు అందుబాటులో ఉన్న వనరులు, పనిచేస్తున్న నీటి ట్యాంకుల వివరాలను గ్రామాల వారీగా సేకరించి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. తక్కువ నీటితో పండించే పంటలకు ప్రోత్సాహం...రబీ సీజన్‌లో రైతులు ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. పెసలు, కందులు, ఉలవలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. బిందు, తుంపర సేద్య పద్ధతుల వినియోగాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ప్రతి గ్రామంలో ముందుగానే వనరులను గుర్తించాలని సూచించారు.... విద్యుత్తు పొదుపుపై అవగాహన...విద్యుత్తు అధికంగా వినియోగించే ప్రాంతాలను గుర్తించి పొదుపు చర్యలు చేపట్టాలని హరిచందన తెలిపారు. సౌర విద్యుత్తు, సౌర బ్యాటరీలు, సౌర మోటార్లు, సూర్యగృహ పథకం వినియోగంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక సర్పంచుల సహకారంతో గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించి ప్రజలను ప్రోత్సహించాలని చెప్పారు. నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్య...భూగర్భ జలాలు తగ్గినా ప్రజలకు తాగునీరు అందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు వి.బి.జి. రామ్‌జీ పథకం కింద పెద్దఎత్తున నీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీల్లో వృథా నీటిని తిరిగి వినియోగించుకునే విధానాలను రూపొందించాలని, గ్రామాల్లో మ్యాజిక్ సోక్ పిట్లు, సామూహిక ఇంకుడు గుంతలు, నీటి నిల్వ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో నీటి భద్రతకు అవసరమైన వనరులను అభివృద్ధి చేయాలని తెలిపారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స సదుపాయాలు, నీడ కల్పించాలని చెప్పారు. ఎండ తీవ్రత కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారానికోసారి సమీక్ష నిర్వహించాలి...మండల ప్రత్యేక అధికారులు ప్రతి వారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై ఎల్‌నినో పరిస్థితులపై సమీక్ష నిర్వహించాలని హరిచందన ఆదేశించారు. గ్రామస్థాయి ప్రణాళికల ఆధారంగా మండల, జిల్లా స్థాయి కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రానున్న డిసెంబరు, జనవరి నెలల్లో పరిస్థితులు మరింత తీవ్రతరం అయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాల పరిస్థితిని వివరించిన కలెక్టర్...నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, జిల్లాలో సాధారణం కంటే 34 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు, తాగునీరు, వ్యవసాయంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. రైతులు వరికి బదులుగా ఉద్యాన పంటలు, పెసలు, కందులు సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వి.బి.జి. రామ్‌జీ పథకం కింద వాననీటి సంరక్షణ నిర్మాణాలు చేపడుతున్నామని, రబీలో పెసలు, ఉలవలు వంటి పంటల సాగుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. తక్కువ నీటితో పంటలు పండించేందుకు అవసరమైన తుంపర, బిందు సేద్య పరికరాలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు నిధులు కేటాయిస్తే ప్రత్యామ్నాయ పంటల సాగును మరింత ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తమ జిల్లాల్లో వ్యవసాయం, భూగర్భ జలాలు, తాగునీరు, విద్యుత్తు, పశుగ్రాసం, సాగునీటి పరిస్థితులు, ప్రత్యామ్నాయ ప్రణాళికలను ప్రత్యేక అధికారికి వివరించారు. సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, సూర్యాపేట అదనపు కలెక్టర్ హరి సింగ్, దేవరకొండ ఉప కలెక్టర్ కరోలినా చింగ్థియాన్ మావి, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, విద్యుత్తు, మిషన్ భగీరథ, ప్రజారోగ్యం, నీటిపారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశం

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు,ఇంచార్జులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు..ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ నల్గొండ -ఖమ్మం -వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి విజయానికి కృషి చేయాలని, ఎన్నికల కార్యాచరణను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# మళ్లీ తెరపైకి డీలిమిటేషన్ మహిళా బిల్లు?

**ఢిల్లీ :** ఎస్ఐఆర్ ప్రక్రియ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనలు తీవ్రమవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తన వ్యూహం మార్చినట్లు తెలుస్తోంది. పార్లమెంట్‌లో కీలక బిల్లుల ఆమోదానికి కేంద్రం సిద్ధం అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవ-రణ బిల్లులపై ఈ నెలాఖరున పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

**గతంలో బిల్లుకు ఎదురుదెబ్బ:**

ఈ ఏడాది ఏప్రిల్ 17న జరిగిన బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, లోక్‌సభతో పాటు రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ (131వ సవరణ) బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సభ్యుల సంఖ్యను 543 నుంచి గరిష్టంగా 850 కి పెంచడం, 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం వంటి ప్రతిపాదనలను ఈ బిల్లులో కేంద్రం పొందుపరిచింది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ప్రభుత్వ ప్రయత్నానికి ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా ఆ బిల్లులను మళ్లీ ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**డీఎంకే, చిన్న పార్టీలతో సంప్రదింపులు!:**

గత సమావేశాలతో పోలిస్తే ప్రస్తుతం తమ బలం పెరిగిందని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షాన చేరారు. బిల్లుల ఆమోదానికి మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో భాగంగా డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తమిళనాడు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో విభేదాలు ఏర్పడటంతో డీఎంకే ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చిన నేపథ్యంలో ఈ సంప్రదింపులకు ప్రాధాన్యం ఏర్పడింది. మరికొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతోనూ ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సంబంధించి ఇంకా ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తికాలేదు. దీంతో ప్రభుత్వానికి అన్ని పరిస్థితులు అనూకూలంగా ఉంటే అక్టోబర్ 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ఓటర్ల తొలగింపుపై ప్రచారం అవాస్తవం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో భారీగా ఓట్లను తొలగించారంటూ జరుగుతున్న ప్రచారంపై సీఈవో సుదర్శన్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఓటర్ల తొలగింపు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా 73.39 లక్షల మంది ఓటర్ల ఫారాలు అందలేదని.. 2.64 కోట్ల మంది ఓటర్ల ఫారాలు స్వీకరించామని తెలిపారు. ఫారాలు అందిన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో చేర్చినట్లు చెప్పారు. ఫారాలు అందని వారి పేర్లు ముసాయిదా జాబితాలో లేవన్నారు.బీఎల్‌వో లు ఇంటింటికీ వెళ్లి ఫారాలను సేకరించారని సీఈవో తెలిపారు. ఓటర్లకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫారాల సమర్పణకు అవకాశమిచ్చామన్నారు. ఫారాలు అందని వారి కోసం క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియ చేపట్టామన్నారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కొత్త ఓటర్లు, యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక అవకాశం కల్పించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పిస్తామని స్పష్టం చేశారు. 73.39 లక్షల మందికి అవకాశం ఇవ్వకుండా తొలగించారన్న ప్రచారం అవాస్తవమని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశా-రు.

# ఎల్ నినోపై ముందుచూపేది?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రత్యేక రాష్ట్రం వచ్చినా కృష్ణానది ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, మూడేళ్లుగా ప్రతి పండకూ రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వచ్చే 10 నెలలు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కోబోతున్నామని, ఎల్ నినోపై రేవంత్ రెడ్డి ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. పాలకుడు అనే వ్యక్తి అందరినీ సమానంగా చూడాలి కానీ అందరినీ సమానంగా చూసే దృష్టి రేవంత్ రెడ్డికి లేదన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ పక్కన కూర్చుని రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం కేవడం రేవంత్ రెడ్డికే చెల్లిందన్నారు. ఎల్ నినో విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలం అయ్యారని విమర్శించారు.

**ఇంకెన్నాళ్లు పాత ప్రభుత్వంపై విమర్శలు:**

నిన్న ప్రెస్ మీట్‌లో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఆయన అవగాహన, అసహాయతను వ్యక్తం చేశారన్నారు. ఎల్ నినో వస్తుందని ఈ ఏడాది ప్రారంభంలోనే నిపుణులు హెచ్చరించారని స్వయంగా ముఖ్యమంత్రే నిన్న చెప్పారు. మరి పది నెలల ముందే ఎల్ నినో వస్తుందని తెలిస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పక్క రాష్ట్రాలు గత ఆగస్టులోనే కరువు మండలాలను ప్రకటించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే దొంగలు పట్ట ఆర్నెళ్లకు అన్న చందంగా సీఎం ఇప్పుడు వచ్చి రైతులు త్యాగాలు చేయాలని అంటున్నారని విమర్శించారు. రైతులను పంటలు వేయొద్దని చెబుతున్న ముఖ్యమంత్రి తాను రాజకీయాలను త్యాగం చేస్తారా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు అయిందని ఇంకెన్నాళ్లు పాత ప్రభుత్వాన్ని తిడుతూ కాలం సాగదీస్తారని నిలదీశారు. కేవలం ప్రభుత్వం తన అవగాహన రాహిత్యంతోనే ఈ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేయలేదని దుయ్యబట్టారు.

**రైతు కూలీలకు రూ. 12 వేల పథకం అమలు చేయండి:**

ఇప్పుడు సీతక్కతో కమిటీ వేస్తే కేంద్రానికి నివేదిక ఎప్పుడు ఇవ్వాలి వారు అనుమతులు ఎప్పుడు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి కేవలం నోటి మాట చెప్పి రైతులను మోసం చేయాలని చూస్తున్నారని కానీ లక్షలాది మంది రైతుకూలీలకు ఎలా న్యాయం చేయబోతున్నారని ప్రశ్నించారు. సీఎం మాటలు వినడానికి చాలా బాగున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వాన్ని నమ్మి రైతుకూలీలను ఎండబెట్టవద్దన్నారు. ఎన్నికల్లో మీరు ఇచ్చిన రైతుకూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పిన పథకం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థిత-ుల్లో ఆదుకునేలా రాష్ట్రంలోని రైతుకూలీలందరికీ లైఫ్ ఇన్సురెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు.

**యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి**

యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రయత్నాలు చేస్తోందని కవిత ఆరోపించారు. ఈ మేరకు గత నెలలోనే ఇదే ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందని ఎందుకు మీరు వైటీపీఎస్‌ను ప్రైవేటీకరణ చేస్తున్నారని ప్రశ్నించారు. పవర్ మ్యాక్ కంపెనీతో మీకు ఉన్న ఒప్పందం ఏంటి? దీని వెనుక జరిగిన అవినీతి ఏంటి అని నిలదీశారు. ఇంతటి సంక్షోభంలోనూ ఈ ప్రభుత్వానికి అవినీతిపైనే దృష్టి ఉందని విమర్శించారు.

# తెలంగాణ నీటి ఎద్దడిపై కేటీఆర్ ధ్వజం

## పంపులు ఆన్ చేయరు.. రిజర్వాయర్లు నింపరు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన ప్రకృతి కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 'చేతకాని కరువు' అని సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం వల్లే వందలాది టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రం పాలయ్యాయని మండిపడ్డారు.

**1000 టీఎంసీల నీళ్లు వృథాగా దిగువకు..**

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ఏకంగా 750 టీఎంసీలకు పైగా గోదావరి నీళ్లను, 250 టీఎంసీల కృష్ణా నీళ్లను సముద్రంలోకి, దిగువకు విడిచిపెట్టారని కేటీఆర్ గణాంకాలతో సహా విమర్శించారు. కన్నెపల్లి, దేవాదుల వంటి ప్రధాన పంపులను సరిగ్గా నిర్వహించి, వాడుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతాల్లోని రిజర్వాయర్లు, చెర-ువులన్నీ నిండి ఉండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇక కృష్ణా నీటిని ఉపయోగించుకోవడానికి వీలుగా ఉండే పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పులను ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించి నీటిని వృథా చేసిందని ధ్వజమెత్తారు.

**కరువుపై హెచ్చరించినా పట్టించుకోలే..**

అయితే, మార్చి నెల నుంచే వాతావరణ నిపుణులు 'ఎల్ నినో' ప్రభావం రాబోతోందని హెచ్చరించినప్పటికీ, కాంగ్రెస్ సర్కార్ ఏమాత్రం ముందస్తు ప్రణాళికలు రచించలేదని కేటీఆర్ మండిపడ్డారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం తెలివిగా నీటిని తరలించుకుపోయిందని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీళ్లను ఏపీ తరలించిందని అన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ టన్నెల్ ద్వారా కృష్ణా నీళ్లను పారించుకుని, చివరకు ఎక్కడో ఉన్న కుప్పం ప్రాంతానికి కూడా నీళ్లను అందించిందని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన హక్కులను, నీటిని కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.




# విద్యార్థుల నిరసనలపై నిఘా..

**ఢిల్లీ :** ప్రస్తుతం జరుగుతున్న విద్యార్థుల నిరసనల పరిణామాలపై కేంద్ర విదేశాంగ శాఖ (వీజూూ) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కీలక వ్యాఖ్యలు చేశఆరు. ఈ నిరసనల పరిస్థితిని మన నిఘా సంస్థలు, సంబంధిత విభాగాలు నిశితంగా పరిశీలిస్తున్నాయని, పరిస్థితులకు అనుగుణంగా అవి తీసుకోనివ్వాల్సిన చర్యలను తీసుకుంటున్నాయని అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై ఆయన స్పందించారు.

**త్వరలోనే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం:**

అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ఖరారు చేసేందుకు ఇరు దేశాలు సానుకూల వాతావరణంలో చర్చలు జరుపుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవలే విదేశాంగ మంత్రి, వాణిజ్య మంత్రులు కూడా దీనిపై మాట్లాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటన సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, యూఏఈ విదేశాంగ మంత్రితో ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు జరిపారని జైస్వాల్ వెల్లడించారు. వ్యాపారం, ఇంధనం, యూఏఈలో నివసిస్తున్న భారతీయుల సంక్షేమంపై ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు.

**మాల్దీవులకు రూ.3,000 కోట్ల కరెన్సీ స్వాప్ రోల్‌ఓవర్:**

మాల్దీవుల అభివృద్ధి భాగస్వామ్యంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని జైస్వాల్ తెలిపారు. మాల్దీవుల ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, 2024 అక్టోబర్‌లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. మొదటి విడత రూ. 3,000 కోట్ల కరెన్సీ స్వాప్ రోల్‌ఓవర్‌ను అక్టోబర్ 23 నుంచి అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించామని వెల్లడించారు. ఈ నిర్ణయం మాల్దీవుల ఆర్థిక స్థిరత్వానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం కెనడా విదేశాంగ మంత్రి ఢిల్లీ పర్యటనకు వచ్చి విదేశాంగ మంత్రితో పాటు ప్రధాని నరేంద్ర మోడీతో కూడా భేటీ అయ్యారని తెలిపారు. ఈ భేటీలో ప్రధానమంత్రి కెనడా పర్యటన అంశం చర్చకు వచ్చిందని, పర్యటన తేదీలను ఖరారు చేసే ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోందని, తగిన సమయంలో అధికారికంగా ప్రకటిస్తామని రణధీర్ జై-స్వాల్ తెలిపారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర సాధనకు ముఖ్య కారణాలు తెలంగాణ యువత బలిదానాలు, వారి పోరాటాలు అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు అయితున్నప్పటికీ ఇంకా ఇక్కడ తీరని కోరికలు, తీరని ఆకాంక్షలు చాలా ఉన్నాయని జనసేన అధ్యక్షుడు, ఏపీడిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ యువత ఆశించింది జనసేన సాధిస్తుందని అన్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారానికి ఉపయోగించే "జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్" ప్రచారం రథంను పవన్ కళ్యాణ్ ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావును గెలిపించాలని పట్టభద్రులను కోరారు. తానెప్పుడూ ప్రజల పక్షానే నిలబడ్డానని, తెలంగాణలో జనసేన పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని మొట్టమొదటి సారిగా చేతులెత్తి అడుగుతున్నానని అన్నారు.

**తెలంగాణ రాష్ట్రానికి సేవ చూసుకునే అవకాశం..**

జనసేన పార్టీని తెలంగాణలోనే స్థాపించినట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ద్వారా మొట్టమొదటి సారి తెలంగాణ రాష్ట్రానికి సేవ చూసుకునే అవకాశం, అదృష్టం లభిస్తోందని అన్నారు. గడల శ్రీనివాసరావుకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్త తరం యువత భవిష్యత్తు కోసం, వారి యొక్క రాజకీయ ఆకాంక్షల కోసం డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రచార రథం ద్వారా ప్రజల్లోకి వస్తున్నట్లు చెప్పారు. 120 రోజుల పాటు ప్రచార రథం ద్వారా ప్రజల్లో తిరుగుతారని, మన తెలంగాణ కోసం ప్రతి ఒక్క పట్టభద్రులు ఈ ప్రచార రథం ఆవశ్యకతను గుర్తించాలని, ప్రచార రథంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల కుర్చీలో కూర్చుని, మీ యొక్క సమస్యలు, ఆలోచనలను పంచుకుని, ఆకాంక్షలను, ఆశయాలను తెలియజేసి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో ఒక లక్ష రూపాయలు కూడా చేతిలో లేకుండా బోర్ వెల్ వేయించిన సందర్భంలో ఆ రోజు ఏర్పడిన ఆకాంక్ష ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 వేల కోట్ల రూపాయలతో జల్ జీవన్ ధార పథకం చేపట్టే స్థాయికి వెళ్ళిందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

# తెలంగాణలో హుందాయ్ భారీ పెట్టుబడి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కార్ల తయారీ పరిశ్రమ స్థాపించడానికి హైదరాబాద్ అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు హ్యుందాయ్ ఇండియా సంస్థకు తెలిపారు. తెలంగాణలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు.ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి గారితో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్ఎంఐఈ) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. "భౌగోళికంగా తెలంగాణ దేశంలో మధ్య భాగంలో ఉంది. దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా, అత్యంత సురక్షితమైనదిగా, జీవించేందుకు అత్యంత అనుకూలమైన నగరంగా గుర్తింపు పొందింది" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఇక్కడి సానుకూల పరిస్థితులను వివరించారు. జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్ఎంఐఈ) సమగ్ర గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. నిమ్జ్ లో రూ. 8,528 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న హ్యుందాయ్ కేంద్రం ద్వారా మొత్తం 4,276 ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకుంది. 678 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి గారికి వివరించింది. రానున్న కొన్ని నెలల్లో ఈ కేంద్రానికి శంకుస్థాపనకు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. 2024లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సమావేశాల సందర్భంగా, తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి గారి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులతో సమావేశమైంది.అనంతరం, 2025 జూన్‌లో హ్యుందాయ్ ప్రతిపాదించిన ప్రతిష్ఠాత్మక ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు మంత్రివర్గ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక ఉపసంఘం ఆమోదం తెలిపింది.తెలంగాణలో కార్ల తయారీ పరిశ్రమను స్థాపించేందుకు రాష్ట్రం అత్యంత అనుకూలమైన ప్రదేశమని ముఖ్యమంత్రి గారు పునరుద్ఘాటించారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్లు, రహదారి, విమాన, రైలు మార్గాల ద్వారా బలమైన రవాణా మౌలిక సదుపాయాలు, భవిష్యత్తులో ఓడరేవులతో హైస్పీడ్ రవాణా అనుసంధానాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికలు రాష్ట్రానికి మరింతగా అనుకూలంగా మారుతాయని వివరించారు.తయారీ రంగం అభివృద్ధి కోసం పెరి-అర్బన్ రీజియన్ వంటి ప్రణాళికాబద్ధమైన ప్రాంతీయ అభివృద్ధి నమూనాల ద్వారా తెలంగాణ వేగవంతమైన పారిశ్రామిక విస్తరణకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికతను ముఖ్యమంత్రి గారు వివరించారు. 2026లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా హ్యుందాయ్ నాయకత్వ బృందాన్ని ఆహ్వానించారు. హెచ్ఎంఐఈ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చాంగ్యోన్ చో మాట్లాడుతూ, "తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో మా భాగస్వామ్యాన్ని కొనసాగి-స్తాం" అని తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ మోటార్స్ ఇప్పటికే హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా సేవలందిస్తోంది. హ్యుందాయ్ ఇండియా ఇంజినీరింగ్ సామర్థ్యాలను మరింత విస్తరించే క్రమంలో, జహీరాబాద్ నిమ్జ్ లో ఏర్పాటు చేయనున్న ఆర్ అండ్ డీ కేంద్రం, భారీ వాహన పరీక్షా కేంద్రం వాహనాల పరీక్షలు, పనితీరు ధ్రువీకరణ, ఇంజినీరింగ్ ప్రక్రియల మెరుగుదలలో కీలక పాత్ర పోషించనుంది. ఈ సమావేశంలో సీఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గారు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గారితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దాదాగిరి చేస్తున్నారా?

**అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ దిగజారి మాట్లాడుతున్నారని, దేశంలో ఓటు చోరీ జరగలేదని అన్నారు. ఎన్నికల సంఘం, ఈవీఎంలపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆయన తప్పుబట్టారు. కాంగ్రెస్ గెలిస్తే జ్ఞానేశ్ కుమార్, ఈవీఎంలను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్‌ను వదిలిపెట్టబోమని రాహుల్ గాంధీ అంటున్నారని, ఆయన దాదాగిరి చేస్తున్నారా? అని ప్రశ్నించారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లారాడారు.

**అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగుతున్నారు:**

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేరును కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. అజిత్ దోవల్ పేరు చెబితే పాకిస్థాన్ గుండెల్లో రైళ్లు పరిగెడతాయని వ్యాఖ్యానించారు. దేశ యువత హృదయాల్లో అజిత్ దోవల్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ దేశంలో ఓట్ చోరీ జరగలేదని, చోరీకి పాల్పడేవారికి ప్రజలు ఓట్లు వేయడం లేదని అన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)తో సంబంధం లేకుండానే గతంలో బీజేపీ అనేక రాష్ట్రాల్లో విజయం సాధించిందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సైతం బ్లాక్‌మెయిల్ చేసేలా మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. తీర్పులు అనుకూలంగా రాకపోతే న్యాయమూర్తులను తప్పుపడుతున్నారని విమర్శించారు. గతంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఎంతో హుందాగా వ్యవహరించారని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగి పట్ల రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అనుచితంగా ప్రవర్తించారని కూడా కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలకు, రాహుల్ గాంధీ మాట్లాడుతున్న తీరుకు పొంతన లేదని వ్యాఖ్యానించారు.

**రేవంత్ రెడ్డిపై విమర్శలు**

తెలంగాణలో ప్రతిపక్ష నేతలను నిత్యం అరెస్టు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఢిల్లీలో మాత్రం పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇస్తున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు, ఢిల్లీలో చేస్తున్న ప్రసంగాలకు మధ్య వ్యత్యాసం ఉందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలహీనపరిచేందుకు కొందరు విదేశాల నుంచి వచ్చి కుట్రలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఒకరు జర్మనీ నుంచి, మరొకరు అమెరికా నుంచి వచ్చి దేశంలో కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశ అభివృద్ధిని చూసి సహించలేని శక్తులు ఈ ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. డీప్ స్టేట్ కుట్రలో భాగమే ఇదంతా అని ఆరోపించారు. ఇందులో భాగంగా ప్రజల్లో అసంతృప్తిని పెంచడం, రాజ్యాంగబద్ధమైన సంస్థలపై అపవాదులు వేయడం జరుగుతోందని కిషన్ రెడ్డి ఆరోపించారు.

# పోలీసుల అదుపులో అభిజిత్, నేహా బోరా..

**ఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీశుక్రవారం "తిరంగా మార్చ్"కు పిలుపునిచ్చింది. ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జాతీయ జెండాలను పట్టుకుని నిరసన తెలపాలని ప్లాన్ చేసింది. అయితే, ఢిల్లీ పోలీసులు ఈ మార్చ్‌కు ముందే సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే, AISA విద్యార్థి నేత నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండిహౌజ్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న నేహా బోరా, వామపక్ష విద్యార్థి సంఘాల నేతల్ని పోలీసులు అడ్డుకున్నారు.తిరంగా ర్యాలీకి ముందు ఢిల్లీ పోలీసులు అభిజిత్ దీప్కే నివాసానికి వెళ్లి ర్యాలీ నిర్వహించవద్దని నోటీసులు అందించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద ఈ నోటీసులు అందించారు. కన్నాట్‌ప్లేస్‌లో ఆంక్షలు అమలులో ఉన్నట్లు పోలీసులు నోటీసుల్లో వెల్లడించారు.ఇదిలా ఉంటే, ప్రతిపక్షాల నేతలు దీప్కే అరెస్టును ప్రశ్నిస్తున్నారు. బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి దీప్కేను అదుపులోకి తీసుకోవడాన్ని "అప్రకటిత ఎమర్జెన్సీ"గా అభివర్ణించారు. సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తిరంగా మార్చ్‌కు మద్దతు ఇస్తూ.. "ఏక్-రంగా వర్సెస్ తిరంగా" అంటూ కామెంట్ చేశారు. ఆప్ నేతలు, కార్యకర్తలు తిరంగా మార్చ్‌లో పాల్గొన్నారు.



## సంపాదకీయం

## రైతును మార్చాలంటే మార్కెట్

# భరోసా కల్పించాలి!



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో యాసంగి సాగు మరోసారి కీలకమైన ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, మరోవైపు అడుగంటుతున్న సాగునీటి ప్రా-జెక్టులు, పాతాళానికి పడిపోతున్న భూగర్భ జలాలు.. ఇవన్నీ రైతాంగానికి ప్రమాద సంకేతాలు పంపుతున్నాయి. అయినప్పటికీ రైతులు మాత్రం వరి సాగుకే సిద్ధమవుతున్నారు. నీటి లభ్యతపై స్పష్టత లేకపోయినా నార-ుమళ్లు పోస్తున్నారు. ఆరుతడి పంటలు సాగు చేయాలని ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పు కనిపించడం లేదు. దీనిని రైతుల మొండిపట్టుదలగా కొట్టిపారేయడం సులభమే. కానీ అసలు సమస్యను లోతుగా పరిశీలిస్తే, ఇది కేవలం పంట ఎంపికకు సంబంధించిన వ్యవహారం కాదని స్పష్టమవుతుంది. మార్కెట్ భరోసా, ఆదాయ భద్రత, సాగునీటి నిర్వహణ, వ్యవసాయ విధానాల మధ్య ఉన్న అంతరాలకు ఇది అద్దం పడుతోంది.

**అడుగంటుతున్న నీటి నిల్వలు.. ప్రమాదంలో యాసంగి**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ)లో నీటి నిల్వలు ఆందోళన కలిగిస-్తున్నాయి. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 90 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 45.76 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అందించిన గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది ఇదే సమయానికి 80.05 టీఎంసీల నిల్వ ఉండటం పరిస్థితిలో వచ్చిన మార్పును స్పష్టం చేస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోనూ నీటి లభ్యత పరిమితంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో సుమారు తొమ్మిది లక్షల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టుకు యాసంగిలో పూర్తిస్థాయిలో నీరందించడం కష్టసాధ్యమే. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడితే వ్యవసాయానికి అందుబాటులో ఉండే నీరు మరింత తగ్గవచ్చు.ఇక్కడ ప్రభుత్వం గుర్తించాల్సిన అంశం ఏమిటంటే, నీటి నిల్వలు తగ్గిన తర్వాత రైతులను అప్రమత్తం చేయడం మాత్రమే సరిపోదు. ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీరు ఎంత? తాగునీటి అవసరాలకు ఎంత కేటాయించాలి? సాగుకు ఎంత మిగులుతుంది? ఏ ప్రాంతాలకు, ఏ పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి? అనే విషయాలపై ముందుగానే స్పష్టమైన కార్యాచరణ అవసరం. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆయకట్టు వారీగా నీటి లెక్కలు రూపొందించి రైతులకు తెలియజేయాలి. అంచనాల ఆధారంగా సాగు ప్రారంభించిన తర్వాత నీరు అందకపోతే నష్టపోయేది రైతే.

**భూగర్భ జలాలపై అతిగా ఆధారపడటం ప్రమాదకరం**

ఉమ్మడి జిల్లాలో సుమారు 1.60 లక్షల వ్యవసాయ బోరుబావులు ఉండగా, వర్షాభావం కారణంగా అనేక ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయి. కొన్ని మండలాల్లో నీరు 12 మీటర్లకు పైగా లోతుకు చేరినట్లు అందిన సమాచారం సూచిస్తోంది. ప్రస్తుతం బోర్లలో కొద్దిపాటి నీరు కనిపించినా, రానున్న వేసవిలో అదే స్థాయిలో నీటి లభ్యత ఉంటుందనే హామీ లేదు.వరి సాగుకు నిరంతర నీటి సరఫరా అవసరం. ముఖ్యంగా పొట్ట దశ, గింజ పాలుపోసుకునే సమయంలో నీటి కొరత ఏర్పడితే దిగుబడి తీవ్రంగా దెబ్బతినవచ్చు. అప్పటివరకు పెట్టిన ఎరువులు, పురుగుమందులు, కూలీ ఖర్చులు, విద్యుత్ వ్యయం అన్నీ రైతుకు భారంగా మారతాయి. నీటి కోసం అదనపు బోర్లు వేయడం లేదా బోర్లను మరింత లోతుకు తీసుకెళ్లడం కూడా సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. అలా చేస్తే అప్పులు పెరగడంతోపాటు భూగర్భ జలాలపై ఒత్తిడి మరింత తీవ్రమవుతుంది. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో వరి విస్తీర్ణాన్ని తగ్గించడం రైతుల ఆర్థిక ప్రయోజనాలతోపాటు నీటి వనరుల పరిరక్షణకు కూడా అవసరం.

**వరి వైపే రైతుల మొగ్గు ఎందుకు?**

అయితే నీటి ప్రమాదం తెలిసినా రైతులు వరి సాగును ఎందుకు వదులుకోవడం లేదు? ఈ ప్రశ్నకు సమాధానం వ్యవసాయ మార్కెట్ వ్యవస్థలోనే ఉంది. వరి పండిస్తే ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ ద్వారా పంటను విక్రయించగలమనే ఒక భరోసా రైతుల్లో ఉంది. దిగుబడి, నాణ్యత, కొనుగోలు నిబంధనలకు సంబంధించిన సమస్యలు ఉన్నప్పటికీ, ఇతర పంటలతో పోలిస్తే వరి విక్రయంపై కొంత స్పష్టత కనిపిస్తుంది. అందుకే రైతులు స్వల్పకాలిక వరి వంగడాల కోసం ప్రయత్నిస్తున్నారు. 90 నుంచి 100 రోజుల్లో పంట చేతికొస్తుందనే ఆశతో తక్కువ వ్యవధిలో సాగు ముగించవచ్చని భావిస్తున్నారు.కానీ స్వల్పకాలిక వంగడాలను ఎంచుకున్నంత మాత్రాన నీటి అవసరం పూర్తిగా తొలగిపోదు. విత్తనం పంట వ్యవధిని తగ్గించవచ్చేమో కానీ, కీలక దశల్లో నీరు అందకపోతే నష్టాన్ని నివారించలేదు. కాబట్టి రైతుల నిర్ణయాన్ని కేవలం సంప్రదాయానికి కట్టుబడిన వైఖరిగా చూడటం సరికాదు. వారి దృష్టిలో వరి ఒక పంట మాత్రమే కాదు.. పెట్టుబడికి తిరిగి ఆదాయం వచ్చే అవకాశమూ. ప్రత్యామ్నాయ పంటలకు మద్దతు ధర, సకాలంలో కొనుగోలు, నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలపై నమ్మకం కల్పించకుండా వరి సాగును తగ్గించాలని కోరడం ఆచరణ సాధ్యం కాదు.

**ప్రచారం కాదు.. ప్రత్యామ్నాయానికి భరోసా కావాలి**

పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర ఆరుతడి పంటలు తక్కువ నీటితో సాగు చేసే అవకాశం కల్పిస్తాయి. అయితే వాటి సాగు విస్తీర్ణం పెరగాలంటే రైతులకు ఆ పంటలపై అవగాహన కల్పించడం ఒక్కటే సరిపోదు. విత్తనాలు అందుబాటులో ఉండాలి. సాగు ఖర్చులపై స్పష్టత ఉండాలి. దిగుబడికి తగిన ధర లభించాలి. పంట చేతికొచ్చిన వెంటనే కొనుగోలు చేసే వ్యవస్థ ఉండాలి. అవసరమైన చోట నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే ప్రభుత్వం, వాటికి గిట్టుబాటు ధర కల్పించే బాధ్యతను కూడా తీసుకోవాలి. వరి వేయవద్దని మైకుల్లో ప్రచారం చేయడం కన్నా, ఏ పంట వేస్తే ఎంత ఖర్చవుతుంది? ఎంత దిగుబడి రావచ్చు? ఏ ధరకు కొనుగోలు చేస్తారు? నష్టం వస్తే ఏ సహాయం అందుతుంది? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ముఖ్యం. రైతు వరి నుంచి ఆరుతడి పంటకు మారినప్పుడు ఆదాయం తగ్గదనే నమ్మకం కలగాలి. అప్పుడే పంటల వైవిధ్యీకరణ నినాదం నుంచి ఆచరణలోకి వస్తుంది.

**ముందస్తు ప్రణాళికతోనే రైతుకు రక్షణ**

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే ఆయకట్టు వారీగా నీటి లభ్యతను అంచనా వేసి, సాగుకు అనుకూలమైన ప్రాంతాలు, పరిమితులు, ప్రత్యామ్నాయ పంటలపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలి. వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణమైన పంటలను సూచించాలి. ఇప్పటికే నారుమళ్లు పోసిన రైతులకు కూడా సాధ్యమైన ప్రత్యామ్నాయాలపై సాంకేతిక సలహాలు అందించాలి. నీటి కొరత వల్ల పంట దెబ్బతింటే బీమా, పరిహారం, రుణాల విషయంలో రైతులకు ఎలాంటి రక్షణ ఉంటుందో ముందుగానే వివరించాలి.అలాగే ప్రాజెక్టుల నీటి వినియోగాన్ని శాస్త్రీయంగా నిర్వహించడం, వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పునఃపూరణపై దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పంటల ఎంపికకే పరిమితం చేయకుండా, నీటి నిర్వహణ నుంచి మార్కెట్ భరోసా వరకు సమగ్రంగా పరిష్కరించాలి.మొత్తానికి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో యాసంగి వరి సాగుపై నెలకొన్న పరిస్థితి ఒక హెచ్చరిక. నీరు లేని చోట వరి సాగు ప్రమాదకరమని రైతులకు చెప్పడం అవసరమే. కానీ ఆ రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎందుకు ఎంచుకోవడం లేదో అర్థం చేసుకోవడం అంతకంటే ముఖ్యం. సాగునీటి భరోసా లేనప్పుడు పంట ఎంపిక మారాలి; పంట ఎంపిక మారాలంటే మార్కెట్ భరోసా ఉండాలి. రైతు నష్టపోకుండా పంటల వైవిధ్యీకరణ సాధ్యమయ్యేలా విధానాలు రూపొందించడమే ప్రభుత్వ బాధ్యత. ప్రచారంతో రైతును మార్చలేం.. నమ్మకంతోనే మార్పు సాధ్యం. ఆ నమ్మకాన్ని కల్పించగలిగితేనే నీటి సంక్షోభం మధ్య రైతాంగాన్ని ఆర్థిక నష్టాల నుంచి కాపాడగలం.

# పెరిగిన ధరలతో బతికేదెలా..?

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశం ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లలో ఆహారధాన్యాల కొరత ఒకటి. విదేశాల నుంచి ఓడలు వస్తేనే ప్రజలకు తిండి గింజలు అందే దుస్థితి ఉండేది. దశాబ్దాలపాటు ఆహార సంక్షోభంతో పోరాడిన భారత్.. హరిత విప్లవంతో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేసింది. ప్రకృతి విపత్తులు వచ్చినా, కరోనా వంటి మహమ్మారి విరుచుకుపడినా ఆహార సరఫరా వ్యవస్థను నిలబెట్టుకోగలిగింది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరోసారి ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణ ప్రతికూలతలు, ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఇంధన వ్యయాలు, సరఫరా అంతరాయాలు కలిసి నిత్యావసరాల ధరలను మండిస్తున్నాయి. ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతున్నా.. సామాన్యుడి వంటింటి బడ్జెట్ మాత్రం కుప్పకూలుతోంది.

**ఆహార ద్రవ్యోల్బణం.. ఆందోళనకర సంకేతాలు**

దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, పెట్టుబడులు, వినియోగం వంటి అంశాలు ఎంత ముఖ్యమో.. ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు నిత్యావసరాలు లభించడం కూడా అంతే ముఖ్యం. కానీ ప్రస్తుతం ఆహార ధరల పెరుగుదల ద్రవ్యోల్బణాన్ని మరింత ఆందోళనకరంగా మారుస్తోంది. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదికలో పేర్కొన్న గణాంకాల ప్రకారం, ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.97 శాతం నుంచి సెప్టెంబర్‌లో 7.74 శాతానికి పెరిగింది. అదే సమయంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.82 శాతం నుంచి 5.54 శాతానికి చేరింది. కొత్త వినియోగదారుల ధరల సూచీ సిరీస్‌లో ఈ స్థాయి ద్రవ్యోల్బణం నమోదు కావడం గమనార్హం. నవంబర్ నాటికి మొత్తం ద్రవ్యోల్బణం 6.7 నుంచి 6.8 శాతానికి చేరవచ్చన్న అంచనాలు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి.ధరల పెరుగుదల కొన్ని వస్తువులకే పరిమితం కాకుండా విస్తృతమవుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. వినియోగదారుల ధరల సూచీలో 75 శాతం వాటా కలిగిన నిత్యావసర వస్తువుల్లో ధరల పెరుగుదల కనిపిస్తున్న వస్తువుల సంఖ్య ఆగస్టులో 25 ఉండగా, సెప్టెంబర్‌లో 31కి చేరినట్లు నివేదిక వెల్లడించింది. అంటే ధరల ఒత్తిడి క్రమంగా మరిన్ని వస్తువులకు విస్తరిస్తోందన్నమాట. ఒకవైపు కొన్ని కూరగాయల ధరలు తగ్గినా, మరోవైపు ఇతర నిత్యావసరాల ధరలు పెరుగుతుండటంతో కుటుంబాలకు పెద్దగా ఊరట లభించడం లేదు.

**ఉల్లిపాయ నుంచి పప్పుదినుసుల వరకు.. ధరాఘాతం**

వంటింటి బడ్జెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నది ఆహార పదార్థాల ధరల పెరుగుదలే. సెప్టెంబర్‌లో ఉల్లిపాయల వార్షిక ద్రవ్యోల్బణం 108.09 శాతానికి చేరగా, వెల్లుల్లి ధరల పెరుగుదల 54.62 శాతంగా నమోదైంది. నిమ్మకాయల ద్రవ్యోల్బణం 36.41 శాతానికి చేరింది. అల్లం ధరల పెరుగుదల 62.85 శాతంగా ఉన్నప్పటికీ, ఆగస్టుతో పోలిస్తే కొంత తగ్గింది. బంగాళాదుంపలు, టమాటాల ధరలు గత ఏడాదితో పోలిస్తే తగ్గినప్పటికీ, మిగిలిన నిత్యావసరాల భారం ఆ ఉపశమనాన్ని మింగేస్తోంది.తెలుగు రాష్ట్రాల్లోనూ పరిస్థితి భిన్నంగా లేదు. నాణ్యమైన సన్నబియ్యం ధర కిలోకు రూ.100 వరకు చేరడం, కందిపప్పు ధర రూ.150 దాటడం సామాన్య కుటుంబాలకు భారంగా మార-ుతున్నాయి. కూరగాయల ధరలు నెల వ్యవధిలో సగటున 42 శాతం వరకు పెరిగినట్లు పేర్కొంటున్న అంచనాలు వినియోగదారుల ఇబ్బందులను ప్రతిబింబిస్తున్నాయి. పాలు, వంటనూనెలు, ఇతర పప్పుదినుసుల ధరల పెరుగుదల కూడా కుటుంబ ఖర్చులను పెంచుతోంది. గతంలో రూ.3 వేలతో సరిపోయే నెలవారీ సరుకులు ఇప్పుడు రూ.4 వేలు దాటుతున్నాయన్న వినియోగదారుల ఆవేదనలోనే ధరల భారం తీవ్రత కనిపిస్తోంది.

**గ్రామీణ ప్రాంతాలపై అధిక ప్రభావం**

ద్రవ్యోల్బణం పెరుగుదలలో మరో ప్రమాదకరమైన అంశం పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ధరల ఒత్తిడి అధికంగా ఉండటం. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, పట్టణ ద్రవ్యోల్బణం 4.88 శాతంగా ఉంటే, గ్రామీణ ద్రవ్యోల్బణం 6.08 శాతానికి చేరింది. గ్రామీణ కుటుంబాల్లో ఆదాయాలు పరిమితంగా ఉండటం, వ్యవసాయంపై ఆధారపడే వర్గాలకు ఆదాయం స్థిరంగా లేకపోవడం వల్ల ధరల పెరుగుదల ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. ఆదాయం పెరగకపోయినా ఆహారం, పాలు, ఇంధనం, రవాణా వంటి అవసరాల కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది.దీంతో కుటుంబాలు తమ ఖర్చులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కిలో కొనాల్సిన సరుకును అర కిలోతో సరిపెట్టుకోవడం, ఖరీదైన పోషకాహార పదార్థాలకు దూ-రమవడం, పిల్లల చదువు, వైద్యం, ఇతర అవసరాలపై ఖర్చులను తగ్గించడం వంటి పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తక్కువ ఆదాయ కుటుంబాల్లో ఆహార ధరల పెరుగుదల కేవలం ఆర్థిక సమస్యగా కాకుండా జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే అంశంగా మారుతోంది.

**ఎల్‌నినో ప్రభావం.. ముందున్న సవాళ్లు**

ప్రస్తుత ధరల పెరుగుదలకు వాతావరణ పరిస్థితులు కూడా ఒక కారణంగా నిలుస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకుంటే వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికే పంటల దిగుబడులపై ఆందోళనలు నెలకొన్న తరుణంలో సరఫరా తగ్గితే ధరలు మరింత పెరగవచ్చు. కొత్త పంట మార్కెట్‌లోకి రాకముందే కొరత ఉంటుందనే అంచనాలతో ధరలు పెంచడం కూడా వినియోగదారులపై అదనపు భారాన్ని మోపుతోంది. అయితే వాస్తవ కొరత ఎంత, వ్యాపార అంచనాలు ఎంతవరకు ధరలను ప్రభావితం చేస్తున్నాయన్నది ప్రభుత్వం పరిశీలించాల్సిన అంశం.ఇక మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో మార్పులు కూడా పరిస్థితిని సంక్లిష్టం చేస్తున్నాయి. ఇంధన ధరలు పెరిగితే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, నిల్వ, ప్రాసెసింగ్ ఖర్చులు పెరుగుతాయి. ఆ భారం చివరకు వినియోగదారులపై పడుతుంది. అందువల్ల ఆహార ద్రవ్యోల్బణాన్ని కేవలం వ్యవసాయ ఉత్పత్తుల సమస్యగా చూడలేం. ఉత్పత్తి నుంచి వినియోగదారుడి చేతికి చేరేవరకు మొత్తం సరఫరా వ్యవస్థను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వ చర్యలే ఉపశమన మార్గం**

ప్రకృతి పరిస్థితులను ప్రభుత్వాలు పూర్తిగా నియంత్రించలేకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవచ్చు. అవసరమైన ఆహార నిల్వలను సమర్థంగా వినియోగించడం, మార్కెట్‌లో సరఫరాను పెంచడం, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే చర్యలను అరికట్టడం, ధరలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టడం తక్షణ అవసరాలు. రైతులకు విత్తనాలు, నీటి వసతి, పంటల బీమా, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సహకారం అందించడం ద్వారా దీర్ఘకాలికంగా ఉత్పత్తి స్థిరత్వాన్ని పెంచవచ్చు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద కుటుంబాలకు నిత్యావసరాలు అందుబాటులో ఉండేలా చూడటం కూడా కీలకం.అదే సమయంలో ధరల పెరుగుదలపై అధికారిక గణాంకాలను పారదర్శకంగా వెల్లడిస్తూ, ప్రజల్లో అనవసర భయాందోళనలు కలగకుండా ప్రభుత్వం జాగ్రత్తపడాలి. వ్యాపారులు భవిష్యత్తులో కొరత ఉంటుందనే అంచనాలతో ముందుగానే ధరలు పెంచితే, దానిని అరికట్టేందుకు మార్కెట్ పర్యవేక్షణను బలోపేతం చేయాలి.దేశం ఆహార స్వయం సమృద్ధి సాధించిందంటే ప్రజలకు ఎప్పుడూ తక్కువ ధరలకు ఆహారం లభిస్తుందనే హామీ కాదు. ఉత్పత్తి, సరఫరా, కొనుగోలు శక్తి మధ్య సమతుల్యత ఉన్నప్పుడే ఆ స్వయం సమృద్ధికి నిజమైన అర్థం ఉంటుంది. ఆర్థిక వృద్ధి ఫలాలు సామాన్యుడి ఇంటి వరకు చేరాలంటే ధరల స్థిరత్వం అత్యవసరం. జీతాలు పెరగకుండా నిత్యావసరాల ధరలు పెరుగుతుంటే ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది; పొదుపులు తగ్గుతాయి; జీవన ప్రమాణాలు దెబ్బతింటాయి. అందువల్ల ద్రవ్యోల్బణాన్ని కేవలం గణాంకాల సమస్యగా కాకుండా సామాన్యుడి జీవనోపాధికి సంబంధించిన కీలక అంశంగా ప్రభుత్వం పరిగణించాలి. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా, ముందస్తు ప్రణాళిక, సమర్థ సరఫరా నిర్వహణ, లక్ష్యిత సహాయ చర్యలతో ధరల భారాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. సామాన్యుడి వంటింటికి ఊరట కల్పించడమే ఇప్పుడు ప్రభుత్వ ఆర్థిక విధానాలకు అసలైన పరీక్ష.

# పదవులు పొందినవారు కొందరే!




తెలంగాణ అంటే సబ్బండ వర్ణాల సమ్మేళనం.. ముక్కోటి గొంతుకల ఆకాంక్ష.. ఎన్నో దశాబ్దాల పోరాటాల ప్రతిరూపం. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని, తమ పిల్లల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని కోట్లాది మంది ప్రజలు ఉద్యమంలో భాగస్వాములయ్యారు. లాఠీల దెబ్బలు తిన్నారు.. కేసులు ఎదుర్కొన్నారు.. ఉద్యోగాలు, చదువులు పక్కనపెట్టారు. మరికొందరు భావితరాల బాగు కోసం ప్రాణాలనే త్యాగం చేశారు. వారి పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కానీ స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమ ఆకాంక్షలు ఎంతవరకు నెరవేరాయన్న ప్రశ్న నేటికీ సమాజాన్ని వెంటాడుతూనే ఉంది.నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో సాగిన తెలంగాణ ఉద్యమం ప్రజల్లో అపారమైన ఆశలను రేకెత్తించింది. సాగునీరు అందుబాటులోకి వస్తుందని రైతులు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని నిరుద్యోగులు, సమాజంలో సమాన గౌరవం లభిస్తుందని అణగారిన వర్గాలు ఆశించాయి. అయితే రాష్ట్ర సాధనతోనే ప్రజల సమస్యలన్నీ పరిష్కారమైపోలేదు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది నాయకులు, మేధావులు, కళాకారులు, కార్యకర్తలు కాలగర్భంలో కలిసిపోయారు. మరికొందరు రాజకీయ ప్రాధాన్యం కోల్పోయి తెరమ-రుగయ్యారు. వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఉద్యమ ఫలాల పంపిణీపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.1969 తెలంగాణ ఉద్యమంతోపాటు మలిదశ ఉద్యమంలోనూ పాల్గొన్న ఆకుల భూమయ్య వంటి నాయకులు ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కోసం జీవితాలను అంకితం చేశారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ ద్వారా ఉద్యమ శక్తులను ఏకం చేయడానికి కృషి చేసిన ఆయన స్వరాష్ట్ర ఆవిర్భావాన్ని చూడకుండానే కన్నుమూశారు. ప్రొఫెసర్లు, ప్రజా ఉద్యమకారులు, మహిళా సంఘాల నాయకులు, కళాకారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తమదైన రంగాల్లో ఉద్యమానికి బలాన్నిచ్చారు. డీఎస్పీ నళిని, విమలక్క, సంధ్య వంటి పలువురు వ్యక్తులు, అనేక మంది అజ్ఞాత కార్యకర్తలు ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేశారు. వీరందరి పాత్రను కేవలం రాజకీయ అధికార మార్పుతో కొలవలేం.మరోవైపు ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా పనిచేసిన కొందరికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, నామినేటెడ్ పదవులు దక్కాయి. ఈటల రాజేందర్, స్వామిగౌడ్, శ్రీనివాస్ గౌడ్, గోరెటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్ వంటి వారు వివిధ సందర్భాల్లో రాజకీయ, ప్రజాప్రతినిధి పదవులను చేపట్టారు. ఉద్యమకారులకు రాజకీయ అవకాశాలు రావడం తప్పు కాదు. ప్రజా ఉద్యమాల నుంచి నాయకత్వం ఎదగడం ప్రజాస్వామ్యంలో సహజమైన పరిణామమే. అయితే కొందరికి లభించిన అవకాశాలతో ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ న్యాయం జరిగినట్లు భావించలేం. వ్యక్తిగతంగా ఎవరు ఎంత సంపాదించారనే ఆరోపణలకంటే, ఉద్యమంలో భాగస్వాములైన సాధారణ ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులను పరిశీలించడం ముఖ్యం.తెలంగాణ ఉద్యమానికి ప్రాణత్యాగం చేసిన కుటుంబాలకు గౌరవం, ఆర్థిక భద్రత, విద్యా, ఉపాధి అవకాశాలు అందుతున్నాయా? ఉద్యమంలో పాల్గొని జీవనోపాధి కోల్పోయినవారికి తగిన గుర్తింపు లభించిందా? నిరుద్యోగ యువతకు న్యాయమైన అవకాశాలు కల్పించగలిగామా? రైతులు, కార్మికులు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ఆశలు ఎంతవరకు నె-రవేరాయి? ఇవే పాలకులు సమాధానం చెప్పాల్సిన కీలక ప్రశ్నలు.రాష్ట్ర సాధన ఒక చారిత్రక విజయం. కానీ ఆ విజయానికి నిజమైన అర్థం రావాలంటే పాలనలో సామాజిక న్యాయం, పారదర్శకత, సమాన అవకాశాలు ప్రతిబింబించాలి. ఉద్యమకారుల గుర్తింపు పేర్లకే పరిమితం కాకూడదు. వారి కుటుంబాల సంక్షేమం, అర్హులైన వారికి ఉపాధి, విద్య, ఆరోగ్యం, జీవన భద్రత కల్పించే విధానాలు అమలులో ఉండాలి. ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాల్లో, ప్రజా వేదికల్లో, అధికారిక రికార్డుల్లో సమగ్రంగా నమోదు చేయాలి.తెలంగాణ తల్లి కన్నీళ్లు తుడవాలంటే గతాన్ని కీర్తించడం మాత్రమే సరిపోదు. ఆ గతం నేర్పిన బాధ్యతను వర్తమాన పాలనలో నెరవేర్చాలి. పదవులు పొందినవారి విజయాలకంటే, అవకాశాలు దక్కని వారి జీవితాల్లో వచ్చిన మార్పులే స్వరాష్ట్ర విజయానికి అసలైన కొలమానం. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి గొంతుకకు గౌరవం, ప్రతి త్యాగానికి గుర్తింపు, ప్రతి కుటుంబానికి న్యాయం లభించినప్పుడే సమానత్వంతో కూడిన తెలంగాణ కల సాకారమవుతుంది. ఉద్యమ ఫలాలు కొందరి విజయగాథలుగా మిగలకుండా, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి పునాదిగా మారాలి. అదే అమరుల ఆశయాలకు నిజమైన నివాళి.

# రూ.వేల కోట్లు దుర్వినియోగం!

## ఆధార్ లింక్‌తో బోగస్ ఉద్యోగుల గుట్టు రట్టు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఒక ప్రభుత్వ ఉద్యోగి.. సెక్రెటేరియట్ స్కావెంజర్‌గా పనిచేస్తుంది. ఆమె రెగ్యులర్ ఉద్యోగి. ఆమె ప్రతి రోజు సెక్రెటేరియట్‌కు వచ్చి తన పని తాను చేసుకుని వెళ్తుంది. ఆమెనే హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోనూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంది. సెక్రెటేరియట్‌లో ఉద్యోగం ముగించుకొని హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఉద్యోగం చేస్తుంది. రెండు ప్రభుత్వ ఉద్యోగాల వేతనం ఆమె తీసుకుంటుంది. వివరాలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకరావడం, ఆధార్ కార్డుకు అనుసంధానించడంతో ఆమె బాగోతం బయటపడింది. ఇలా ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 3900 మంది... ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవారు డబుల్ శాలరీ డ్రా చేస్తున్నారని ప్రభుత్వం గుర్తించింది. గుర్తించడమే కాదు వారికి జూన్ నెల నుంచి శాలరీని నిలిపివేశారు. నాలుగు నెలలుగా శాలరీలు నిలిపివేసినా కూడా ఇంత వరకు తమకు వేతనం రావడంలేదంటూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదని గుర్తించారు. అయితే వీరిలో 600 మంది వరకు పోలీసు శాఖలో నక్సల్స్ బాధిత కుటుంబాలు ఉన్నాయని, నక్సల్స్ కాల్పుల్లో, పేలుళ్లలో మరణించడంతో పోలీసు శాఖలో ఒకరికి ఉద్యోగం ఇచ్చారు.. అదే సమయంలో చనిపోయిన వారికి వారి రిటైర్‌మెంట్ ఏజ్‌వచ్చే వరకు వేతనాన్ని జమ చేస్తున్నారు. ఇలా 600 మంది వరకు ఉండొచ్చని, మిగిలిన వారందరు అంటే దాదాపుగా 3300 వరకు బోగస్ ఉద్యోగులేనని నిర్ధారించారు. వీరు గత కొన్ని యేండ్లుగా రెండు శాలరీలు తీసుకుంటున్నారని, ఇలా వేల కోట్లలో నిధులు దుర్వినియోగం అయ్యాయని గుర్తించారు.

**ఒకే గొడుగు కిందకు ఉద్యోగులు..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఉద్యోగంలో పనిచేయకపోయినా పనిచేసినట్టుగా, ఒకే వ్యక్తి రెండు రకాలు వేతనాలు తీసుకోవడం, ప్రభుత్వ ఉద్యోగులు అయినా అధికారుల ఇళ్లలో పనిచేస్తున్నారని సీఎంకు ఫిర్యాదులు అందాయి. వీటన్నింటిపై పారదర్శకంగా వ్యవహరించేందుకు ప్రతి శాఖ ప్రభుత్వ ఉద్యోగి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వివరాలను అన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చారు. ఇందుకోసం అధికారులు పెద్ద కసరత్తే చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్తాయి ప్రతి అధికారి, ఉద్యోగి వివరాలను డిజిటలైజ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులే కాదు.. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల వివరాలను సైతం నమోదు చేశారు. ఆధార్ నెంబర్‌ను తప్పనిసరి చేశారు. వారి వివరాలతో అనుసంధానించారు. సచివాలయం నుంచి దీని కోసం పెద్ద కసరత్తే చేశారు. అనేకసార్లు గడువు పొడిగించారు. వివరాలు ఇవ్వకుంటే వేతనం నిలిపివేస్తామని హెచ్చరించారు. చివరికి మే నెలలో పూర్తి వివరాలు వచ్చాయి. ఆ తరువాత డబుల్ శాలరీ తీసుకునే వారికి వేతనాలను నిలిపివేశారు. వేతనాలు నిలిపివేసే సమయంలో ఒకటికి రెండు సార్లు వెరిఫై చేసుకొని వేతనాలను నిలిపివేశారు. నాలుగు నెలలుగా వేతనాలు నిలిపివేసినా ఎవరూ తమకు వేతనాలు రావడంలేదని ఫిర్యాదులు, విజ్ఞాపనలు రాకపోవడంపై అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఇంత ఘోరంగా ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతున్నా నియంత్రించే వ్యవస్థ లేకపోవడం, దాని గురించి ఆలోచించకపోవడాన్ని ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు.

**క్రిమినల్ చర్యలు..**

అధికారులు మరొక ముందుడుగు వేసి డబుల్ శాలరీ తీసుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, వారిపై కేసులు పెట్టాలని, వారు తీసుకున్న శాలరీని రికవరీ చేయాలని నిర్ణయించారు. కొందరిపై కేసులు కూడా పెట్టినట్టుగా తెలిసింది. అయితే ఈ వివరాలు బయటికి రావాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగంలో ఏదైనా తేడా వస్తే ఉద్యోగం ఊడుతుందని తెలిసినా నిర్భయంగా రెండు శాలరీలు ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుని జైలుకు పంపించి, వారి నుంచి ఇప్పటి వరకు తీసుకున్న వేతనాన్ని మొత్తం రికవరీ చేయాలని, ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ వినిపిస్తుంది.

# నా ఇంటిపై నిఘా పెట్టారు..

### సీజేపీ ఫౌండర్ అభిజిత్ దీప్కే కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ :** ఢిల్లీలో సెంట్రల్ పార్క్ మూసివేతపై సీజేపీ ఫౌండర్ అభిజిత్ దీప్కే స్పందించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'లెహ్రా దో తిరంగా' మార్చ్‌కు ముందు భద్రతా ఆంక్షలు విధించారని, సెంట్రల్ పార్క్ మూసివేశారని అన్నారు. తాను భయపడటం లేదని, ఇక్కడే ఉన్నానని చెప్పారు. వచ్చి కావాలంటే అరెస్ట్ చేసుకోవచ్చని సవాల్ చేశారు. పోలీసు అరెస్టులకు, ఆంక్షలకు బెదిరేది లేదని దీప్కే స్పష్టం చేశారు. త్వరలో పోలీసులు తనను అదుపులోకి తీసుకోవచ్చని అన్నారు. తన నివాసం వద్ద పోలీసులు, ఇంటెలిజెన్స్ బ్యూరో సిబ్బంది నిఘా పెట్టారని వెల్లడించారు. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌ను అక్టోబర్ 16, 17 తేదీలలో మూసివేస్తున్నట్లు ఎన్‌డీఎంసీ ప్రకటన చేసిందన్నారు. ఓటర్ల జాబితా సవరణ అవకతవకలపై సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలకు పిలుపునిచ్చామని, సెంట్రల్ పార్క్ వద్దకు వచ్చి జాతీయ జెండా ఎగురవేయాలని మద్దతుదారులకు సీజేపీ పిలుపునిచ్చారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు తనను అనుసరిస్తున్నాయని అన్నారు. పోలీసుల అరెస్టులకు తాము భయపడబోమని చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించి, స్వతంత్ర వ్యక్తిని నియమించాలని డిమాండ్ చేశారు.

# వ్యాపారులకు నష్టం జరిగితే ఊరుకోం

**ఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ 'తిరంగా నిరసన' నేపథ్యంలో న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కనాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌లను మూసివేయడంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. తాజా నిర్ణయం వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లినట్లు తెలిస్తే, రాజ్యాంగ పరిహార అధికారాలను ఉపయోగించి కఠిన చర్యలు తీసుకుంటామని అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది.

**రూ.200 కోట్ల వ్యాపార నష్టం.. వర్తకుల ఆందోళన**

కనాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌ల మూసివేతపై ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ తరఫున అడ్వకేట్ జై అనంత్ దేహద్రాయ్ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. దసరా పండుగ సీజన్ సమీపిస్తున్న వేళ సెంట్రల్ పార్క్‌లో నిరసనలు, ఎన్‌డీఎంసీ విధించిన ఆంక్షల వల్ల రోజుకు దాదాపు రూ.200 కోట్ల మేర వ్యాపార లావాదేవీలకు విఘాతం కలుగుతుందని, ఇది చిన్న వ్యాపారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**సుప్రీంకోర్టు ధర్మాసనం రియాక్షన్ ఇదే..**

ఈ క్రమంలోనే జై అనంత్ దేహద్రాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. వాదనల వేళ సీజేఐ సూర్యకాంత్ మాట్లాడుతూ.. అందరికీ సద్బుద్ధి కలుగుతుందని ఆశిస్తున్నాం. పండుగ రోజుల్లో చిన్న షాపుల యజమానులు తమ జీవనోపాధిని పొందుతారని మాకు తెలుసు. ఇలాంటి సమయంలో వ్యాపారాలకు అంతరాయం కలిగితే ఆ కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయని కామెంట్ చేశారు. ఇదే అంశంపై జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ కూడా రియాక్ట్ అయ్యారు. ఒకవేళ ఎన్‌డీఎంసీ విధించిన ఆంక్షలు దామాషాకు మించి ఉన్నాయని, వ్యాపారులకు అక్రమంగా నష్టం కలిగిందని కోర్టు భావిస్తే.. రాజ్యాంగ పరిహార నియమాల ప్రకారం నష్టపరిహారం ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దసరా సెలవుల అనంతరం కేసులో తదుపరి విచారణను అక్టోబర్ 26కు కోర్టు వాయిదా వేసింది.



# రాహుల్ గాంధీ, సీజేపీపై ధర్మేంద్ర ప్రధాన్ ఫైర్..!

**సీజేపీ నిరసనలపై తొలిసారి స్పందించిన ధర్మేంద్ర ప్రధాన్.. విద్యార్థుల పేరుతో అచకాలకు పాల్పడుతున్నారు.. రాహుల్ గాంధీ అధికార దాహంతో ప్రజాతీర్పు అవమానిస్తున్నారు.. బంగ్లాదేశ్ స్ఫూర్తి, అధికార మార్పు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం..**

**ఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ, కాంగ్రెస్, రాహుల్ గాంధీలపై మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ నేత ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. విద్యార్థులు, జాతీయ ప్రయోజనాలతో ప్రారంభమైన నిరసనలు ఇప్పుడు దేశంలో అరాచకాన్ని సృష్టించి, రాజకీయ వ్యవస్థను అస్థిరపరిచే ప్రయత్నంగా మారాయని ఆయన ఆరోపించారు. ఎక్స్ వేదికగా ధర్మేంద్ర ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికైన ప్రభుత్వాన్ని మార్చాలని, బంగ్లాదేశ్ ఉద్యమం మాకు స్ఫూర్తి బహిరంగంగా మాట్లాడటం వెనక వారి అసలు ఉద్దేశాన్ని బయటపెడుతున్నాయని అన్నారు. విద్యార్థుల ముసుగులో దేశంలో అరాచకాలను సృష్టించాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. భారత్‌లో అధికార మార్పు ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారానే సాధ్యమవుతుందని వారు గుర్తించాలని హితవు పలికారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ ప్రజాతీర్పును పదే పదే అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలవకపోతే ప్రజాస్వామ్య సంస్థలపై అపనమ్మకం కలిగించే ప్రయత్నాలను కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్ని నిరంతరం ఇబ్బందులకు గురిచేయడమే కాంగ్రెస్ పని అని ఆరోపించారు. అధికార దాహంతో రాజ్యాంగ సంస్థల్ని అవమానిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యం పట్ల రాహుల్ గాంధీ వైఖరి అత్యంత సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మక్త వెంకటాపురం పాఠశాలకు జిల్లా స్థాయి ఆహార ప్రదర్శనలో ప్రథమ బహుమతి




**మెదక్ జిల్లా/రేగోడు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**దేశవ్యాప్తంగా నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసోత్సవాల ముగింపు వేడుకలు మెదక్ జిల్లా కేంద్రంలోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ ఏడాది "మన అంగన్‌వాడీ - మన బాధ్యత" అనే ప్రత్యేక నినాదంతో చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 19న నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార ప్రదర్శన పోటీలలో రేగోడ్ మండల పరిధిలోని మక్త వెంకటాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాలోనే ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. పాఠశాల తరపున ప్రదర్శించిన పోషకాహార స్టాళ్ళు, సాంప్రదాయ వంటకాలు జిల్లా స్థాయిలోనే ప్రథమ స్థానాన్ని దక్కించుకొని అందరినీ ఆకట్టుకున్నాయి.

**మెదక్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం:**

ఈ ఘన విజయం సాధించినందుకు గాను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాఠశాల బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్, ఉపాధ్యాయురాలు పుష్పలకు ఉత్తమ అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చిన్న పిల్లలు, గర్భిణులలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు మరియు అంగన్‌వాడీల బలోపేతానికి సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్.టి.యు) జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు. రేగోడ్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం పట్ల మండల విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కొత్త వెంకటాపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# దేశమంతా జంతర్ మంతర్‌గా మారుతోంది



**తిరువనంతపురం :**

రానున్న రోజుల్లో దేశమంతా జంతర్ మంతర్‌గా మారబోతోందని నటుడు ప్రకాశ్ రాజ్ అన్నారు. ఇవాళ ఆయన తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ ఎంపిక ప్రక్రియ, ఆ నిర్ణయం వెనుక ఉన్న విధానాన్ని సమాజం అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిందని సెటైర్లు వేశారు.

**యువత, రైతులు రోడ్లపైకి వస్తున్నారు..**

దేశంలో పెరుగుతున్న అసంతృప్తిపై ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ.. ఇవాళ దేశంలో విద్యార్థులు ఉద్యమించడం మొదలుపెట్టారని తెలిపారు. వారి నిరసనలకు రైతులు, పౌర సమాజం గొంతు కలిపిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి చూస్తుంటే.. దేశంలోని ప్రతీ ప్రాంతం, ప్రతీ నగరం ఓ 'జంతర్ మంతర్'లా మారిపోతోందని కామెంట్ చేశారు. దేశవ్యాప్తంగా మళ్లీ పౌర హక్కుల పోరాటాలు, ప్రజా నిరసనలు ఊపందుకుంటున్నాయనడానికి ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలే నిదర్శనమని ప్రకాశ్ రాజ్ అన్నారు.

# మెడికల్ షాపులపై అధికారుల కొరడా!





**పెద్దపల్లి జిల్లా, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

నియంత్రిత ఔషధాల అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాస్ రావు నేతృత్వంలో ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెడికల్ షాపుల్లో నార్కోటిక్, డ్రగ్స్ నిరోధక శాఖ, సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ బృందాలు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ట్రామడాల్, టాపెంటడాల్, నైట్రాజెపామ్, ప్రెగాబాలిన్, జోల్పిడెమ్, అల్ప్రాజోలం వంటి నియంత్రిత ఔషధాలతో పాటు కోడిన్ కలిగిన దగ్గు సిరప్‌ల విక్రయాలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్లు, విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేసి, ఔషధ చట్టాలు, నిబంధనల ప్రకారం మందుల విక్రయాలు జరుగుతున్నాయా లేదా అనే అంశంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పిట్ట శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. నియంత్రిత మందులను విక్రయించే సమయంలో వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. మెడికల్ షాపుల యజమానులు, సిబ్బంది ఔషధ విక్రయాలకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. అనుమతులు లేకుండా నియంత్రిత లేదా నిషేధిత మందులను విక్రయించడం, సరఫరా చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఔషధాల విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పెద్దపల్లి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పిట్ట శ్రవణ్ కుమార్, నార్కోటిక్/టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్, సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రసాద్ రెడ్డి (ఆర్ఐ), ఎస్ఐ ఆర్.ఎస్. యాదవ్, హెడ్ కానిస్టేబుల్ బి. మురళీకృష్ణతో పాటు నార్కోటిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతిభద్రతల నడుమ పండుగలు జరుపుకోవాలి

**మెదక్ జిల్లా/రేగోడు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రేగోడు మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పాత్రికేయ మిత్రులు బతుకమ్మ, దసరా పండుగలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రేగోడు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోచయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు, మీడియా మిత్రులకు, వారి కుటుంబ సభ్యులకు మరియు మండలంలోని అక్కాచెల్లెళ్లకు ఆయన పండుగ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ రోజుల్లో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ పోలీసుల సూచనలు పాటించాలని ఎస్ఐ కోరారు. ముఖ్యంగా గ్రామాల పాత ఆనవాయితీ ప్రకారమే పండుగలు జరుపుకోవాలని, పండుగల విషయంలో అనవసరమైన కొత్త నియమాలు తీసుకురావద్దని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో 'నేను ముందు, నువ్వు ముందు' అనే అహంభావాలకు పోకుండా, పరస్పర సహకారంతో, భక్తిభావంతో పండుగను ఆనందించాలని విజ్ఞప్తి చేశారు.

# కలెక్టర్లకూ లేని ఎడిట్ ఆప్షన్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సెక్షన్ 22ఏ కింద రెవెన్యూ అధికారులు పెట్టిన చిచ్చు ఇంకా ఆరలేదు. పట్టా భూములను ప్రభుత్వ భూములని, అసైన్డ్, భూదాన్, ఖారీజ్ ఖాతా అంటూ లక్షలాది మంది ఖాతాలను బ్లాక్ చేశారు. గతేడాది డిసెంబరులో ప్రభుత్వ, కోర్టు కేసులకు సంబంధించిన భూములంటూ డేటాను అప్ లోడ్ చేశారు. దాంతోనే కొన్ని లక్షలాది మంది కొనుగోలు చేసిన భూములు పీవోబీలో చేరాయి. ఐతే ఏడింట అత్యంత కీలకమైన రెండు కేటగిరీలను నేటికీ అప్ లోడ్ చేయలేదు. దేవాదాయ భూములు, మరొకటి వక్ఫ్ భూములు. ఈ రెండు కేటగిరీలను ఓపెన్ చేస్తే అండర్ ప్రాసెస్ అని చూపిస్తున్నది. గత ప్రభుత్వంలో వక్ఫ్, ఎండోమెంట్ భూములను కాపాడుతామన్న పేరిట భూముల డేటాకు వేసిన 'ఆటో లాక్' ఎంత విధ్వంసం సృష్టించిందో రుజువులు ఉన్నాయి. ఇప్పుడు కొత్త నిషేధిత జాబితాల్లోనూ ఎలాంటి డేటా అప్ లోడ్ చేస్తారోనన్న ఆందోళన నెలకొన్నది. హైకోర్టు ఆదేశాల మేరకు అంటూ గతేడాది డిసెంబరులో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ వెబ్ సైట్ లోని ప్రొహిబిటెడ్ జాబితాలో మాత్రమే పీడీఎఫ్ ఫైళ్లను అప్ లోడ్ చేశారు. కానీ భూ భారతికి అనుసంధానం నేటికీ చేయలేదు. ఇక వక్ఫ్, ఎండోమెంట్ జాబితాలు కూడా అప్ లోడ్ చేస్తే ఇంకెన్ని లక్షల మంది రైతుల మీద దుష్ప్రభావం పడుతుందోనన్న ఆందోళన నెలకొన్నది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల మేరకు లెక్కలను తేల్చారు. ఐజీఆర్ఎస్ వెబ్ సైట్ లోని ప్రొహిబిటెడ్ మాడ్యూల్ లో దర్శనమిస్తున్నాయి. దాంతోనే తమ పట్టా భూములు ప్రభుత్వం/అసైన్డ్/ఖారీజ్ ఖాతా అంటూ నమోదు చేశారని లక్షలాది మంది అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అది కూడా ఈ డేటాను భూ భారతి ఆర్వోఆర్ కి అనుసంధానం చేయకముందే చోటు చేసుకున్నది. 22ఏ లిస్టులను భూ భారతిలోని ల్యాండ్ డిటెయిల్స్ కి లింక్ చేసి, అక్కడ క్లాసిఫికేషన్ లోనూ ఈ నిషేధంలో చూపించిందే నమోదు చేస్తే ఇంకెంత మంది బాధితులు ఉన్నారో గుర్తించేందుకు మార్గం సుగమం అవుతుంది. ప్రస్తుతం తమ భూమి భూ భారతిలో పట్టాగానే ఉందంటూ ధీమాగా ఉన్నారు. కానీ ఐజీఆర్ఎస్ వెబ్ సైట్ లోని అగ్రికల్చర్ పీవోబీ లిస్టుల్లో తమ పేర్లు, తమ సర్వే నంబర్లు ఉన్నాయో, లేవో అన్నది చెక్ చేసుకోలేదు. ఇదిలా ఉంటే గతేడాది డిసెంబరు నుంచి 22ఏ లిస్టుల్లో దేవాదాయ, వక్ఫ్ భూముల డేటాను అప్ లోడ్ చేయకుండా ఖాళీగా ఉంచారు. ఆ ప్రాసెస్ పది నెలలైనా ఓ కొలిక్కి రాకపోవడానికి కారణాలేంటో అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అలాగే ప్రస్తుతం దేవాదాయ శాఖ మంత్రి కూడా ఎవరూ లేకపోవడం వల్ల ఆ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారుల మధ్య గ్యాప్ ఏర్పడిందా? అంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ప్రభుత్వం సెక్షన్ 22ఏ కింద దేవాదాయ భూముల కింద 2,757 ఖాతాల్లోని 49,143 ఎకరాలను బ్లాక్ చేసినట్లుగా ప్రకటించింది. వక్ఫ్ భూముల లెక్క చెప్పలేదు. ఐతే ఈ లెక్క ఐజీఆర్ఎస్ వెబ్ సైట్ లో ఎందుకు లేదన్నది సందేహం. 2024 ఫిబ్రవరిలో ధరణి కమిటీ రివ్యూ ప్రకారం దేవాదాయ శాఖకు 91,827 ఎకరాల ల్యాండ్ ఉంది. తెలంగాణలో 85 వేల ఎకరాలు, మిగతాది ఇతర రాష్ట్రాల్లో ఉంది. ఐతే అప్పటికి ధరణి పోర్టల్ లో డీఎస్ పూర్తయ్యింది 49,460 ఎకరాలు, డీఎస్ పెండింగులో ఉన్నది 15 వేల ఎకరాలు. అలాగే వక్ఫ్‌బోర్డు సమర్పించిన లెక్కల ప్రకారం 77,538 ఎకరాలు. ఐతే 57,427 ఎకరాలు కబ్జాకు గురైంది. ధరణి పోర్టల్ లో డీఎస్ పూర్తయ్యింది 14,573 ఎకరాలు, డీఎస్ పెండింగు కింద 9671 ఎకరాలు. భూదాన్ ల్యాండ్ కోనేరు రంగారావు రిపోర్ట్ ప్రకారం 1,71,404 ఎకరాలు. అందులో సాగుకు పనికొచ్చేది 93,715 ఎకరాలు. భూదాన్ బోర్డు లెక్కల ప్రకారం 1,69,291 ఎకరాలకు భూదాన పత్రాలు ఉన్నాయి. 69 ఎకరాలు సాగుకు పనికి రానిది. సాగుకు పనికొచ్చేది 99,552 ఎకరాలు. పంపిణీ చేయనిది బోర్డు ఆధీనంలోని ల్యాండ్ 4,800 ఎకరాలు మాత్రమే. పీడీఎఫ్ రూపంలో ఉన్న నిషేధిత భూముల జాబితాలను సవరించడం అసాధ్యం. కోర్టు కేసుల వరకు మాత్రమే విడివిడిగా కనిపిస్తున్నాయి. కానీ ఇప్పుడు పట్టా భూమి అని, పొరపాటుగా నమోదైందని అధికారులు గుర్తించినా సవరించే అవకాశమే లేదు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చినప్పుడు కూడా ఇలాంటి సమస్య తలెత్తలేదు. రెండింటా సెక్షన్ 22ఏ కింద రూపొందించిన లిస్టులను అప్ లోడ్ చేశారు. అలాగే ప్రతి ఖాతా, ప్రతి సర్వే నంబర్, సర్వే నంబర్ సబ్ డివిజన్ లోనూ ల్యాండ్ స్టేటస్ దగ్గర పీవోబీలో ఉందని చూపించింది. ఇప్పుడు అదే సాఫ్ట్ వేర్ ని వినియోగిస్తూ నడుపుతున్న భూ భారతి పోర్టల్ లో మాత్రం ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ ని అనుసంధానం చేయలేకపోయారు. వ్యవసాయ భూముల డేటాలో ఎలాంటి పొరపాట్లు లేవంటూ సీసీఎల్ఏ వర్గాలు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నాయి. పట్టా ల్యాండ్స్ పొరపాటున పీవోబీలో నమోదయ్యాయని జీపీవో నుంచి కలెక్టర్ వరకు గుర్తించినా న్యాయం దక్కే పరిస్థితి లేదు. నేటికీ కలెక్టర్లకు కూడా ఐజీఆర్ఎస్ లోని పీవోబీ పీడీఎఫ్ ఫైళ్ల ఎడిట్ ఆప్షన్ లేదు. ధరణి పోర్టల్ అమలైనప్పుడు వక్ఫ్, ఎండోమెంట్, భూదాన్ ల్యాండ్స్ కింద ఎన్ని జిమ్మిక్కులు జరిగాయో అందరికీ తెలుసు. ఓ సర్వే నంబరులోని మొత్తం విస్తీర్ణం 100 ఎకరాలైతే, పది ఎకరాల భూదాన్ పెట్టే బదులుగా మొత్తాన్ని బ్లాక్ చేసిన ఉదంతాలు కోకొల్లలు. అప్పట్లోనే కొన్ని లక్షల మంది రైతులు నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలంటూ అప్లై చేసుకున్నారు. కొన్నేండ్లు, నెలల పాటు అధికారుల చుట్టూ తిరిగి, వారికి కావాల్సిందేదో సమర్పించుకున్న తర్వాత డెలీట్ చేశారు. ఐతే వాటికి సంబంధించిన స్పీకింగ్ ఆర్డర్, ఆర్డర్ కాపీలేవీ రైతులకు అందజేయలేదు. తిరిగి మరోసారి నిషేధిత జాబితాలో వక్ఫ్, ఎండోమెంట్, భూదాన్ అని నమోదు చేస్తే ఎన్ని ఏండ్లు తిరగాలోనన్న ఆందోళన నెలకొన్నది. ఉన్నత స్థాయి రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సీఎంవో అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# పారిశుద్ధ్య కార్మిక మహిళలకు దసరా కానుకలు

**పీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుకానుకల పంపిణీ**
**ముఖ్య అతిథిగా పాల్గొన్న తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్**








**రామచంద్రపురం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రామచంద్రపురం దసరా పండుగను పుర-స్కరించుకుని పారిశుద్ధ్య కార్మిక మహిళలకు అండగా నిలుస్తూ పీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుకానుకల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉన్న పీఎన్ ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. సీఎంసీ అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని రామచంద్రపురం, భారతీనగర్ డివిజన్లకు చెందిన పారిశుద్ధ్య సిబ్బంది మహిళలకు దసరా పండుగ కానుకగా చిరుకానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మహిళా పారిశుద్ధ్య కార్మికులకు కానుకలను అందజేశారు.

**పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం**

పట్టణాలు, కాలనీలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, ముఖ్యంగా మహిళా కార్మికులు ప్రతిరోజూ తమ విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పండుగ సమయాల్లో వారి కష్టాన్ని గుర్తించి, వారితో సంతోషాలను పంచుకోవాలనే ఉద్దేశంతో పీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పండుగలను సంతోషంగా జరుపుకోవాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. పండుగ వేళ తమకు చిరుకానుకలు అందజేయడంపై పారిశుద్ధ్య కార్మిక మహిళలు సంతోషం వ్యక్తం చేశా-రు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## త్రాగునీటి సమస్యని పరిష్కరించిన సర్పంచ్

**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలోని గొల్లవాడలో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన మోటార్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఎల్పుల సరిత శుక్రవారం తెలిపారు. వారం రోజుల క్రితం పాత మోటార్ పూర్తిగా చెడిపోవడంతో కొత్త మోటార్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతి, గ్రామస్తులు పాల్గొన్నారు. నూతన మోటార్ ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.



## శివాజీ సేన జిల్లా అధ్యక్షుడిగా అంకారి అనిల్ నియామకం

**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** శివాజీ సేన తెలంగాణ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా అంకారి అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు తోట మధుకర్ నియామక పత్రాన్ని అందజేశా-రు. సమాజ సేవ పట్ల అనిల్ కుమార్‌కు ఉన్న అంకితభావం, పట్టుదలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తోట మధుకర్ తెలిపారు. సమాజ సేవ, హిందూ ధర్మ పరిరక్షణ, గోమాతల రక్షణతో పాటు పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జిల్లాలో శివాజీ సేనను మరింత బలోపేతం చేస్తూ, ధర్మ పరిరక్షణ, గోమాతల రక్షణ, పురాతన ఆలయాల పునరుద్ధరణతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర కమిటీకి అంకారి అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, హిందూ ధర్మ పరిరక్షణకు, ఆలయాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం..

**ఆలయంలో ప్రత్యేక పూజలు.. కాంగ్రెస్‌లోకి 20 మంది చేరిక**
**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి రాజాపూర్ మండలంలో పర్యటన**





**మహబూబ్ నగర్ జిల్లా/రాజాపూర్, ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శుక్రవారం రాజాపూర్ మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నర్సింగ్ తాండా గ్రామపంచాయతీ పరిధిలోని దేవుల తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం చొక్కంపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ స్వయంభు లక్ష్మీ సమేత తిరుమలనాథ స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్చర్ల నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, హేమాజీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో పోలే లక్ష్మయ్య, మంద మహేంద్ర, భవన్ల జంగయ్య, మాదుగుల అనంతయ్య, పవన్ యాదవ్, అక్షయ్ యాదవ్, భైరమోని రాజు, భైరమోని నర్సింలుతో పాటు మరో 12 మంది కలిపి మొత్తం 20 మంది కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్, గ్రామ అధ్యక్షుడు కోట్ల మురళి, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాలకే పరిమితమైన సరఫరా!

**తొమ్మిది నెలలుగా ఎదురుచూపులు.. దసరా నాటికైనా విద్యుత్ అందించాలని కాలనీవాసుల డిమాండ్**
**ఇళ్ల మీదుగా వెళ్తున్న 11 కేవీ పాత విద్యుత్ లైన్ తొలగించి, కొత్త లైన్‌ను వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి**







**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని బీసీ కాలనీలో విద్యుత్ సమస్యలు కాలనీవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కాలనీలో గృహాల మధ్య విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సుమారు తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు విద్యుత్ సరఫరా ప్రారంభం కాకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా, సరఫరా మాత్రం వాటికే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు పూర్తయినప్పటికీ, విద్యుత్ సరఫరాకు అవసరమైన మిగిలిన పనులు పూర్తి చేయకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయా-యని కాలనీవాసులు పేర్కొంటున్నారు. సమస్య పరిష్కారం కోసం సంబంధిత కాంట్రాక్టర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన లేకపోవడంతో తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

**ఏడాది క్రితమే మంజూరైన కొత్త 11 కేవీ లైన్.. అయినా తొలగని పాత లైన్ సమస్య!**

ఇదిలా ఉండగా, తీదేడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపం నుంచి నివాస గృహాల మీదుగా వెళ్తున్న పాత 11 కేవీ విద్యుత్ లైన్ సమస్య కూడా ఇంతవరకు పరిష్కారం కాలేదు. ఇళ్ల మీదుగా ప్రమాదకరంగా విద్యుత్ లైన్ వెళ్తుండటంతో ఆందోళనకు గురైన గ్రామస్తులు గతంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కొత్త విద్యుత్ లైన్ మంజూరుకు చొరవ తీసుకున్నారని గ్రామస్తులు తెలిపారు. కొత్త లైన్ నిర్మాణ పనులు చేపట్టి స-ుమారు ఏడాది గడుస్తున్నప్పటికీ, పాత లైన్‌ను తొలగించి కొత్త లైన్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన ఇంత కీలకమైన సమస్య పరిష్కారంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు. కొత్త లైన్ నిర్మాణం పూర్తయినప్పటికీ దానిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో సమస్య ఇంకా కొనసాగుతోందని పేర్కొంటున్నారు.

**అధికారులకు విన్నవించినా ఫలితం లేదు: ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్**

ఈ సమస్యలను ఇప్పటికే సంబంధిత విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి ఫలితం కనిపించడం లేదని తీదేడు గ్రామ ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి, బీసీ కాలనీలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి దసరా పండుగ నాటికైనా కాలనీవాసులకు విద్యుత్ సరఫరా అందించాలని ఆయన విజ్ఞప్తి చేశా-రు. అదేవిధంగా, ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ చొరవతో మంజూరైన కొత్త 11 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణం పూర్తయినందున, దానిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఇళ్ల మీదుగా వెళ్తున్న పాత విద్యుత్ లైన్‌ను తొలగించి, కొత్త లైన్ ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ రెండు సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్ కోరారు.

**దసరా నాటికైనా విద్యుత్ వెలుగులు అందేనా?**

దసరా పండుగ నాటికైనా బీసీ కాలనీకి విద్యుత్ వెలుగులు అందించాలని, ఇళ్ల మీదుగా వెళ్తున్న పాత విద్యుత్ లైన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు, కాలనీ కార్యవర్గం అధికారులను కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మంజూరు చేయించిన పనులు సైతం పూర్తిస్థాయిలో అమలులోకి రాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు మేల్కొని, బీసీ కాలనీలో పెండింగ్ పనులను పూర్తి చేసి విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, కొత్త 11 కేవీ లైన్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి పాత లై-న్‌ను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారా, లేక కాలనీవాసుల ఎదురుచూపులు మరికొంతకాలం కొనసాగుతాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# డిండి రైతులకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు.. సీఎండీ హామీ!

**రైతుల పంటల రక్షణకు ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేక చొరవ**
**పెండింగ్ డీటీఆర్‌ల విడుదలకు విజ్ఞప్తి.. తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు హామీ**



**నల్లగొండ జిల్లా/ చింతపల్లి దేవరకొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** డిండి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గడంతో పంటలను కాపాడుకునేందుకు బోరుబావులపై ఆధారపడుతున్న రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)కు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన సీఎండీ.. అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిమాండ్ డ్రాఫ్టులు (డీడీలు) చెల్లించి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతులకు పెండింగ్‌లో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను (డీటీఆర్‌లు) వెంటనే విడుదల చేసి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అత్యవసరంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. డిండి రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గడంతో రైతులు వ్యవసాయ బోరుబావులపై ఆధారపడాల్సి వస్తోందని, ఈ సమయంలో విద్యుత్ లోడ్ సమస్యలు తలెత్తితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే బాలు నాయక్ విజ్ఞప్తిపై సీఎండీ సానుకూలంగా స్పందిస్తూ, రైతుల అవసరాలను పరిశీలించి తగిన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సాగులో ఉన్న పంటలను కాపాడటం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎమ్మెల్యే.. విద్యుత్ శాఖ అధికారులు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వ-రరావు పాల్గొన్నారు. రైతులకు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి వచ్చి విద్యుత్ సమస్యలు పరిష్కారమైతే సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు ఎంతో తోడ్పాటు లభించనుంది.



## హరితహారం పై జెసిబి కొరడా

**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** హరితహారం చెట్లు తొలగించి ప్రజాధనం వృధా చేసిన ఘటన వెలువర్తి గ్రామంలో చోటుచేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకొని స్థానిక సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో జెసిబి సాయంతో రోడ్డు వెంట ఉన్న పిచ్చి చెట్లను తొలగించే క్రమంలో వెల్వర్తి నుండి మొగిలిపాక రోడ్డుకు ఇరువైపుల ఉన్న పచ్చని చెట్లను తొలగించారు. గతంలో కూడా ఈ గ్రామంలో హరితహారం చెట్లను రెండు, మూడు పర్యాయాలు తొలగించడం జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ పథకంలో పెట్టిన మొక్కలకు పాదులు తీసి, ఉపాధి కూలీలను నియమించి ట్రాక్టర్ సహాయంతో నీళ్లు పెట్టి పెద్దగా పెంచిన క్రమంలో ఇప్పుడు చెట్లను తొలగించడం సరికాదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి పచ్చని చెట్లను తొలగించి, ప్రజాధనాన్ని వృధా చేసిన వారిపై, జెసిబి యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## పేద రోగులకు అండగా వాలంటీర్లు.. సేవలకు యాదవ చారిటబుల్ ట్రస్ట్ ప్రోత్సాహం



**పెద్దపల్లి జిల్లా, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నిరుపేద రోగులకు సేవలందిస్తున్న వాలంటీర్ల సేవలు అభినందనీయమని యాదవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ మారం తిరుపతి యాదవ్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో గత 15 నెలలుగా రోగులకు సేవలందిస్తున్న వాలంటీర్లకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా గౌరవ వేతనాలను పంపిణీ చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా వాలంటీర్లు చేస్తున్న కృషి ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న వాలంటీర్ల అంకితభావాన్ని గుర్తించి, వారిని ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని తెలిపారు. వాలంటీర్లలో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు, సేవా కార్యక్రమాల పట్ల బాధ్యతాయుతమైన పనితీరును పెంపొందించాలనే ఉద్దేశంతో యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌరవ వేతనాలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ట్రస్ట్ తరఫున భవిష్యత-్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సామ తిరుపతి యాదవ్, ప్రభుత్వ ఆసుపత్రి వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చెంగిచెర్ల శ్రీ వెంకటేశ్వరా కాలనీలో ఘనంగా దేవీ శరనవరాత్రి ఉత్సవాలు...





**బోడుప్పల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మేడ్చల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్లలోని శ్రీ వెంకటేశ్వరా కాలనీలో శ్రీ దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా దేవీ శరనవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వ రోజు అమ్మావారు శ్రీ జ్ఞాన సరస్వతి దేవీ మాత అలంకరణలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వరా కాలనీ అధ్యక్షులు సాయి లక్ష్మి డెవెలపర్స్ అధినేత, సీనియర్ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు శెట్టి హరికాంత్ గుప్తా ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులతో కలిసి మండపంవద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్త రవి గౌడ్,కొత్త నాయకులు కొత్త కిషోర్ గౌడ్, కుర్రి శివ శంకర్, బిజెపి నాయకులు ఎనుగు సుదర్శన్ రెడ్డి, ముఖ్యఅతిధులుగా విచ్చేసి మండపంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజాల కార్యక్రమంలో పాల్గొని. అనంతరం అన్నదాన కార్యక్రమంలో కాలనీ వాసులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శెట్టి హరికాంత్ గుప్తా మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల ప్రజలందరూ ముఖ్యంగా శ్రీ వెంకటేశ్వరా కాలనీ వాసులు సుఖ సంతోషాలతో ఉండాలని చెంగిచెర్ల ప్రజలకు మరియు మా కాలనీ వాసులకు ఇతర కాలనీల ప్రజలకు భవాని యూత్ అసోసియేషన్ సభ్యులకు దేవీ శరనవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు.



# ఢిల్లీ క్యాపిటల్స్‌కు బిగ్ షాక్..

వచ్చే ఏడాది జరగనున్న ఐపీఎల్ 2027లో ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ ఆడటంపై సందిగ్ధత నెలకొంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా బిజీ షెడ్యూల్, కీలక టెస్టు సిరీస్‌ల నేపథ్యంలో ఐపీఎల్‌లో పాల్గొనడంపై స్టార్క్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయాన్ని అతడే వెల్లడించడంతో వచ్చే సీజన్‌లో స్టార్క్ అందుబాటుపై చర్చ మొదలైంది. ఒకవేళ ఇదే నిజమైతే.. ఢిల్లీ క్యాపిటల్స్‌కు బిగ్ షాక్ తగలనుంది. ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌లకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ జట్లకు తమ స్టార్ ఆటగాళ్ల సేవలు నిరంతరం అందుబాటులో ఉండటం పలు బోర్డులకు సవాలుగా మారుతోంది. ముఖ్యంగా ఆస్ట్రేలియా జట్టు వచ్చే ఏడాది కీలక సిరీస్‌లు ఆడాల్సి ఉంది. ఇంగ్లండ్‌తో మార్చి 11 నుంచి ప్రారంభం కానున్న చారిత్రాత్మక 150వ వార్షికోత్సవ టెస్టుతో పాటు యాషెస్ సిరీస్ కూడా ఆస్ట్రేలియా షెడ్యూల్‌లో ఉన్నాయి. వీటితో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించే అవకాశం, రానున్న ప్రపంచకప్ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆటగాళ్ల పనిభారంపై క్రికెట్ ఆస్ట్రేలియా ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఐపీఎల్ 2027లో తన భాగస్వామ్యంపై ఇప్పటికే కొన్ని చర్చలు జరిగాయని మిచెల్ స్టార్క్ వెల్లడించాడు. అయితే ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయానికి రాలేదని స్పష్టం చేశాడు. దీంతో వచ్చే సీజన్‌లో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడతాడా లేదా అన్నది ఇంకా స్పష్టత లేదు. ఆస్ట్రేలియా హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ కూడా ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్ మధ్య సమతుల్యత అవసరమని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ ప్రపంచంలోని అత్యుత్తమ టీ20 టోర్నీల్లో ఒకటని, ఇందులో ఆడటం ఆటగాళ్ల ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. అయితే జాతీయ జట్టు అవసరాలు, ఆటగాళ్ల శారీరక సామర్థ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియా జట్టు భవిష్యత్తులో వరుసగా కీలక సిరీస్‌లు ఆడాల్సి ఉండటంతో ఫాస్ట్ బౌలర్ల పనిభారంపై కోచింగ్, వైద్య బృందాలు సమీక్ష చేస్తున్నాయి. ముఖ్యంగా ఫాస్ట్ బౌలింగ్ చేసే ఆటగాళ్లు దీర్ఘకాలం ఫిట్‌నెస్‌ను కొనసాగించాలంటే తగిన విశ్రాంతి అవసరమని మెక్‌డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు. 'దేశం తరఫున ఆడాలా? ఫ్రాంచైజీ తరఫున ఆడాలా? అనే చర్చల కంటే ప్రస్తుతం మా ఫాస్ట్ బౌలర్లకు శరీరాన్ని తిరిగి సిద్ధం చేసుకునే సమయం ఇవ్వడం ముఖ్యం. రానున్న 20 లేదా 21 మ్యాచ్‌ల సుదీర్ఘ ప్రయాణంలో వారు అత్యుత్తమంగా రాణించేందుకు అవసరమైన ఫిట్‌నెస్‌ను సాధించాలి' అని ఆస్ట్రేలియా కోచ్ తెలిపాడు. ఆటగాళ్లు తమ కెరీర్‌కు, జాతీయ జట్టు అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారని మెక్‌డొనాల్డ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. కీలక అంతర్జాతీయ పోటీల్లో ఆస్ట్రేలియా తరఫున రాణించడమే ఆటగాళ్ల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాడు. మిచెల్ స్టార్క్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ 2026 సీజన్ కోసం రూ. 11.75 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే గాయాల కారణంగా అతడు ఆ సీజన్‌లో కేవలం ఆరు మ్యాచ్‌ల్లో మాత్రమే ఆడాడు. వచ్చే ఏడాది అంతర్జాతీయ షెడ్యూల్ మరింత బిజీగా ఉండటంతో ఐపీఎల్‌లో అతడి భాగస్వామ్యంపై అనిశ్చితి నెలకొంది. అయితే స్టార్క్ ఐపీఎల్ 2027కు దూరమవుతాడని ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. అతడి అందుబాటు, ఫిట్‌నెస్, ఆస్ట్రేలియా జట్టు షెడ్యూల్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

# 14 ఏళ్ల తర్వాత భారత జట్టుకు కొత్త సారథి..



భారత మహిళా క్రికెట్‌లో సరికొత్త శకం మొదలుకాబోతోంది. రాయ్‌పూర్‌లో జింబాబ్వేతో జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌లో స్మృతి మంధాన భారత జట్టును పూర్తి స్థాయి కెప్టెన్‌గా నడిపించనుంది. ఆమెకు కెప్టెన్సీ కొత్తేమీ కాదు. ఇంతకుముందు కూడా మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ఆమెకు ఉంది. కానీ ఇప్పుడు ఆమె భుజాలపై ఉన్న బాధ్యత వేరు, ఈ మ్యాచ్ ఆమె కెప్టెన్సీ కెరీర్‌లోనే ఓ కొత్త ఆరంభం కానుంది. మహిళా క్రికెట్‌లో కెప్టెన్ మారడం అనేది చాలా అరుదుగా జరిగే పరిణామం. ముఖ్యంగా 2012 తర్వాత ఇది చాలా స్పష్టంగా కనిపిస్తుంది. 2000 నుంచి 2012 మధ్య కాలంలో భారత్ ఆరుగురు వేర్వేరు కెప్టెన్ల ఆధ్వర్యంలో ఆడింది. కానీ గత 14 ఏళ్లలో మాత్రం కేవలం ఇద్దరే ఇద్దరు కెప్టెన్లు జట్టును నడిపించారు. వారిలో ఒకరు మిథాలీ రాజ్ కాగా, మరొకరు హర్మన్‌ప్రీత్ కౌర్. మిథాలీ రాజ్ 2022లో రిటైర్ అయ్యే వరకు వన్డేలు, టెస్టుల్లో జట్టును లీడ్ చేసింది. ఇక షార్టెస్ట్ ఫార్మాట్‌లో 2016లో పగ్గాలు చేపట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్.. నాలుగేళ్ల కిందట పూర్తి స్థాయి కెప్టెన్ అయ్యింది. ఆమె నాయకత్వంలోనే భారత్ చారిత్రాత్మక వన్డే ప్రపంచ కప్ విజయాన్ని సాధించింది. అయితే ఇప్పుడు సమయం మారడంతో జట్టులో మార్పులు రావాల్సిన అవసరం ఏర్పడింది. అలా వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లలో జట్టు లీగ్ దశలోనే వెనుదిరగడంతో.. ఇప్పుడు ఆ బాధ్యతలను 30 ఏళ్ల దిగ్గజ ఓపెనర్ స్మృతి మంధానకు అప్పగించారు. శుక్రవారం రాయ్‌పూర్‌లో ఫుల్ టైమ్ కెప్టెన్‌గా తొలిసారి మైదానంలో అడుగుపెట్టనుంది మంధాన. గతంలో కూడా తాను చెప్పినట్లుగానే, టీ20ల్లో భారత్ లోపాలను ఆమె ఎప్పుడూ దాచుకోలేదు, కుండబద్దలు కొట్టినట్లు స్పష్టంగా మాట్లాడుతుంది. "గత రెండు టీ20 ప్రపంచ కప్‌లలో మేము అర్హత సాధించలేకపోయాం. మేమందరం బాగానే ప్రిపేరై అక్కడికి వెళ్లామని భావించినా, ఇది మా అందరినీ తీవ్రంగా బాధించింది. అయితే టీ20 క్రికెట్‌లో ఫిట్‌నెస్, ఫీల్డింగ్, బౌలింగ్, బ్యాటింగ్.. ఇలా అన్ని విభాగాల్లోనూ మనకు ఇంకా కావాల్సింది ఏంటో స్పష్టంగా తెలుసు. మనం ఏమీ తక్కువ కాదని, బాగున్నామని నేను అనను, మనం మంచివారమే. కానీ ఆఖరి మెట్టుపై మరో పది శాతం మెరుగుదల అవసరం ఉంది" అని మంధాన చెప్పింది. "ఈ విషయం మన అమ్మాయిలందరికీ బాగా తెలుసు, మేమందరం దానికోసమే కష్టపడుతున్నాం. ఇదొక చక్కటి యువ జట్టు, వీళ్లతో పనిచేయడం చాలా సరదాగా ఉంటుంది. గత మూడు రోజుల్లో నేను గమనించిన దాని ప్రకారం.. ప్రతి ఒక్కరూ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విషయంలో ఎంతో నిబద్ధతతో ఉన్నారు" అని మ్యాచ్‌కు రెండు రోజుల ముందు స్మృతి మంధాన తెలిపింది. నిజానికి మ్యాచ్‌కు ముందు రోజు విలేకరుల సమావేశం జరగాల్సి ఉండగా, మంధాన బుధవారమే మీడియా ముందు మాట్లాడింది. ఆ తర్వాత రోజు జట్టు న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లింది. ఇక, గత వారం బీసీసీఐ పెద్దలతో జరిగిన సమావేశం తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ తన రాజీనామా సమర్పించడంతో.. ఆ తర్వాత మంధానను కెప్టెన్‌గా ప్రకటించారు. ఈ పరిణామాలన్నీ ఎలా జరిగాయో మంధాన చాలా స్పష్టంగా వివరించింది. "మీ అందరికీ ఏ రోజు అయితే ఈ విషయం తెలిసిందో, నాకూ అదే రోజు తెలిసింది. ఆ సమావేశంలో చర్చంతా భారత క్రికెట్‌ను ముందుకు ఎలా తీసుకెళ్లాలి, రాబోయే రెండు మూడు సంవత్సరాలలో మన విధానం ఎలా ఉండాలి అనే దాని గురించే జరిగింది. ఎందుకంటే మనకు ముందు ముందు చాలా పెద్ద టోర్నమెంట్లు ఉన్నాయి. కౌర్ గత 10 ఏళ్లుగా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆమెకు అపారమైన అనుభవం ఉంది, జట్టులో చాలా సీనియర్ ఆటగాళ్లు ఆమెకు మద్దతుగా ఉంటారు. భారత క్రికెట్ అభివృద్ధి కోసం, భవిష్యత్తులో మనం బాగా రాణించడానికి ఏమేం చేయాలో ఆ సమావేశంలో చర్చించాము" అని మంధాన వెల్లడించింది. కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించడం తన బ్యాటింగ్‌ను మరింత బలోపేతం చేస్తుందని మంధాన నమ్ముతోంది. "నాకు 15 ఏళ్ల వయసున్నప్పుడే నా కోచ్ ఒక మాట చెప్పారు. 'నువ్వు బ్యాటింగ్‌కి వెళ్లినప్పుడల్లా నువ్వే కెప్టెన్ అనుకో' అని చెప్పారు. ఎందుకంటే అలా అనుకున్నప్పుడే ఆ బాధ్యత మనకు అలవడుతుంది. ఆ పద్ధతిలో ఇప్పుడూ ఎలాంటి మార్పు ఉండదు. ఒకవేళ బాల్ నా జోన్‌లోనే పడితే, జట్టుకు ఏది అవసరమో దానికోసమే నేను ఆడుతూనే ఉంటానని" ఆమె తేల్చి చెప్పింది. తనదైన దూకుడు స్వభావాన్ని బ్యాటింగ్‌లో కొనసాగిస్తానని మరోసారి స్పష్టం చేసింది.

# టీమిండియాలోకి భువీ రీఎంట్రీ..




న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ వేళ నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి రీఎంట్రీ ఇస్తున్న వెటరన్ స్వింగ్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ను టీమ్ సౌథీ కొనియాడారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో టిమ్ సౌథీ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఎంతోమంది బౌలర్లు వేగంతో, ఎక్స్ ఫ్యాక్టర్‌తో బౌలింగ్ చేస్తున్నారు. కానీ భువనేశ్వర్ కుమార్ ఇన్నింగ్స్‌పై పూర్తి కంట్రోల్, కొత్త బాల్‌ను ఉపయోగించడం, ఇన్నింగ్స్‌ను ముగించడం, అతడి సుదీర్ఘమైన అనుభవం భారత జట్టులోని యువ బౌలర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రశంసించారు. ఇక న్యూజిలాండ్ పిచ్‌ల తీరును టిమ్ సౌథీ ప్రస్తావిస్తూ.. తమ పిచ్‌లపై మంచి బౌన్స్ ఉంటుందన్నారు. భువీ ఈ పిచ్‌లపై చాలా యాక్యురేట్‌గా బౌలింగ్ చేయగలడని పేర్కొన్నారు. భారత్‌కు ఆడే అవకాశం మళ్లీ రాకపోవచ్చని భువీ అనుకుని ఉండవచ్చు, కానీ ఐపీఎల్‌లో ప్రదర్శనతో ఆ అవకాశాన్ని పట్టేశాడని అన్నారు. మెంటల్‌గా అతడు చాలా స్ట్రాంగ్‌గా ఉన్నాని టిమ్ సౌథీ పేర్కొన్నారు. కాగా, గత రెండు ఐపీఎల్ సీజన్లలో భువనేశ్వర్ కుమార్ ఏకంగా 45 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత వేగవంతమైన బౌలర్‌గా భువీ రికార్డు కొనసాగుతోంది.

# బిజినెస్

## డీజిల్‌పై తగ్గింపు.. పెట్రోల్‌పై పెంపు..!



పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ (అదనపు లాభాల పన్ను)ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్ ఎగుమతులపై లీటరుకు రూ. 16గా ఉన్న పన్నును రూ. 8.50కి తగ్గించగా, పెట్రోల్ ఎగుమతులపై లీటరుకు రూ. 0.50గా ఉన్న ట్యాక్స్‌ను రూ. 2.50కి పెంచింది. ఈ మార్పులు కేవలం విదేశాలకు ఎగుమతి చేసే ఇంధనానికి మాత్రమే వర్తిస్తాయని, దేశీయ మార్కెట్‌లో విక్రయించే పెట్రోల్, డీజిల్ ధరలపై దీని ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టమైంది. అంటే మీ నగరంలోని పెట్రో బంకుల్లో ధరలు ఈ నిర్ణయం వల్ల నేరుగా మారవు. దేశంలో ఇంధన కొరత రాకుండా చూసేందుకు, ఆయిల్ కంపెనీలు దేశీయ మార్కెట్‌ను కాదని విదేశాలకు ఎక్కువగా ఇంధనాన్ని ఎగుమతి చేయకుండా కట్టడి చేసేందుకే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల కదలికలను బట్టి ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఈ పన్నులను సమీక్షిస్తుంటారు. ఈ పన్నుల మార్పు కారణంగా సామాన్యులపై భారం పడుతుందా లేదా అనే సందేహం కలగడం సహజం. అయితే, దేశంలో అమ్ముడవుతున్న ఇంధనంపై ఎలాంటి ఎక్సైజ్ డ్యూటీ మార్పు చేయనందున, ప్రస్తుతానికి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. భవిష్యత్తులో ధరలు మారుతాయా లేదా అనేది చమురు కంపెనీల నిర్ణయాలు, మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. శుక్రవారం నాటి ధరల ప్రకారం దేశంలోని ప్రధాన నగరాల్లో ఇంధన ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఇక దీనికి ముందు అక్టోబర్ 1వ తేదీన కూడా ప్రభుత్వం ఎగుమతి పన్నులను సవరించింది. ఆ సమయంలో డీజిల్ ఎగుమతి సుంకాన్ని లీటరుకు రూ. 20 నుంచి రూ. 16కి తగ్గించగా, పెట్రోల్ పన్నును రూ. 0.50 వద్దే కొనసాగించారు. అంతర్జాతీయ మార్కెట్లలో క్రూడ్ ఆయిల్ ధరల్లో వచ్చే హెచ్చుతగ్గుల ఆధారంగానే ఈ నిర్ణయాలు తీసుకుంటారు. అసలు ఈ పన్ను విధానం గురించి మాట్లాడుకుంటే.. చమురు కంపెనీలు ఊహించని రీతిలో ఆర్జించే అదనపు లాభాలపై ప్రభుత్వం ఈ ప్రత్యేక పన్నును విధిస్తుంది. అంతర్జాతీయంగా చమురు ఉత్పత్తుల ధరల తీరుతెన్నులను బట్టి ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ రేట్లను సవరిస్తూ ఉంటారు. దేశంలో ఇంధన ఎగువంతులపై ఈ పన్నును తొలిసారిగా జూలై 2022లో ప్రవేశపెట్టారు. సుమారు రెండేళ్ల పాటు అమల్లో ఉన్న దీనిని ఆ తర్వాత తొలగించి, తిరిగి మార్చి 2026లో మళ్లీ అమలులోకి తెచ్చారు.

## పోటీకి మేమెప్పుడూ భయపడలేదు




అమెరికా కుబేరుడు ఎలోన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థ 'స్టార్‌లింక్' భారత్‌లోకి ప్రవేశించడంపై గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో భారత టెలికాం మార్కెట్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్లో పోటీని ఆహ్వానిస్తున్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. ఇందులో స్టార్‌లింక్ కూడా భాగమేనని పేర్కొంది. అయితే, ఈ రంగంలోకి వచ్చే ప్రతి సంస్థ దేశీయ చట్టాలు, ప్రస్తుత నిబంధనలకు కట్టుబడి పనిచేయాల్సిందేనని తేల్చిచెప్పింది. భారత్‌లో స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి ఇక్కడి కొందరు వ్యాపారవేత్తలు, కార్పొరేట్ శక్తులు అడ్డుపడుతున్నాయంటూ మస్క్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అలాగే ముకేశ్ అంబానీని ఉద్దేశిస్తూ భారత టెలికాం రంగంలో పోటీ తత్వంపై ప్రశ్నలు గుప్పించారు. మస్క్ ఆరోపణల నేపథ్యంలో రిలయన్స్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. "మేము ఎప్పుడూ పోటీకి భయపడలేదు. వినియోగదారులకు ఎవరు అత్యుత్తమ సేవలను అందిస్తున్నారో నిరూపించుకోవడానికి పోటీనే అతిపెద్ద పరీక్షగా మేము భావిస్తాం" అని తెలిపింది. తన టెలికాం విభాగమైన 'జియో ప్లాట్‌ఫార్మ్స్' ప్రయాణాన్ని రిలయన్స్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. 2016లో జియో సేవలు ప్రారంభించినప్పుడు తమకు ఒక్క కస్టమర్ కూడా లేరని, కానీ కేవలం పదేళ్ల కాలంలో జియో వినియోగదారుల సంఖ్య 53 కోట్లకు పైగా పెరిగిందని వెల్లడించింది. భారతీయ పౌరులకు మెరుగైన డిజిటల్ సేవలతో పాటు ప్రపంచంలోనే అత్యంత చవకైన మొబైల్ డేటాను అందుబాటులోకి తీసుకురావడంలో జియో కీలక పాత్ర పోషించిందని కంపెనీ పేర్కొంది. స్టార్‌లింక్‌తో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలోకి వచ్చే అన్ని కంపెనీలను తాము ఆహ్వానిస్తున్నామని చెప్పిన రిలయన్స్.. జియోతో సహా ప్రతి ఒక్కరూ భారతీయుల ప్రయోజనాల కోసం, దేశ చట్టాలు, విధానాలకు లోబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. భారత్‌లో స్వదేశీ, విదేశీ పెట్టుబడులకు, కొత్త ప్రయోగాలకు ఎప్పుడూ స్వాగతం ఉంటుందని, అయితే ఇదంతా చట్ట పరిధిలోనే జరగాలని వివరించింది. మరోవైపు, శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి కంపెనీకి ఒకే రకమైన నిబంధనలు, ప్రక్రియలు వర్తిస్తాయని భారత ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. తమ సొంత శాటిలైట్ నెట్‌వర్క్ సేవలకు సంబంధించి జియో కూడా ప్రస్తుతం ప్రభుత్వ అనుమతుల కోసమే వేచి చూస్తోందని రిలయన్స్ ఈ సందర్భంగా వెల్లడించింది. భారత్‌లో స్టార్‌లింక్ సేవలు ప్రారంభించడానికి సన్నాహాలు చేసుకుంటున్న వేళ రిలయన్స్ చేసిన ఈ ప్రకటన టెలికాం వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో ఏ ఒక్కరి గుత్తాధిపత్యానికి తావులేదని ప్రభుత్వం ఇప్పటికే తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే.

## ప్రస్తుతానికి స్థిరంగా పసిడి ధరలు..



ఈ వారం వరుసగా పతనం అవుతున్న పసిడి ధరలకు నేడు బ్రేకులు పడ్డాయి. నేడు (అక్టోబర్ 16) భారత్‌లో పసిడి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,47,440. నిన్నటితో పోలిస్తే ధరల్లో పెద్దగా మార్పు లేదు. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ. 1,35,150 వద్ద స్థిరంగా ఉంది. కిలో వెండి ధర రూ. 2.4 లక్షల వద్ద నిలకడగా కొనసాగుతోంది.

## పెరిగిన ఫెవికాల్ ధరలు

ప్రముఖ అదెసివ్స్ తయారీ సంస్థ పిడిలైట్ ఇండస్ట్రీస్ తన ప్రధాన బ్రాండ్ ఫెవికాల్ ఉత్పత్తుల ధరలను అక్టోబర్‌లో మరోసారి కిలోకు రూ. 5 చొప్పున పెంచింది. ఫెవికాల్ ఎంఆర్, ఎస్‌హెచ్ సింథటిక్ రెసిన్, మెరైన్, ప్రోబాండ్ వంటి అన్ని ప్రముఖ ఉత్పత్తులకు ఈ పెంపు వర్తిస్తుంది. దీంతో కంపెనీ ఈ ఏడాదిలో ధరలను పెంచడం ఇది మూడోసారి కావడం గమనార్హం. అంతకుముందు మే-జూన్‌లో కిలోకు రూ. 10, జూలైలో రూ. 26 చొప్పున ధరలను పెంచిన పిడిలైట్.. ఆగస్టులో స్వల్పంగా రూ. 10 తగ్గించినప్పటికీ, మళ్లీ అక్టోబర్‌లో రేట్లను పెంచాల్సి వచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల వల్ల ముడి పదార్థాల ధరలు విపరీతంగా పెరగడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. ఫెవికాల్ తయారీలో అత్యంత కీలకమైన ముడి పదార్థమైన 'వినైల్ అసిటేట్ మోనోమర్' (వీఏఎం), ఇతర పెట్రోలియం ఆధారిత ఇన్‌పుట్ ఖర్చులు ఏకంగా 40 నుండి 50 శాతం వరకు పెరగడంతో తయారీదారులపై ఒత్తిడి పడుతోంది. పిడిలైట్ కంపెనీ మొత్తం వార్షిక ఆదాయంలో సుమారు 40 శాతం వాటాతో పాటు, దాదాపు 24 శాతం లాభాల మార్జిన్లను అందించే ఫెవికాల్ పోర్ట్‌ఫోలియోపై ఈ భారం పడకుండా ఉండేందుకే కంపెనీ ధరల పెంపును అమలు చేసింది.






# పెళ్లి చేసుకునేది పనిమనిషి అవ్వడం కోసం కాదు..

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'క్రేజీ కల్యాణం'. ఈ సినిమా రిలీజ్‌కు రాబోతుండగా.. ప్రమోషన్స్‌లో పాల్గొన్న అనుపమ తన పెళ్లిపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'ఈ సినిమాలో నాకు పెళ్లి అవుతుందా కాదా అనేది పక్కకి పెడితే.. ఇందులో నా పెళ్లిపై చాలా ఒత్తిడి ఉంటుంది. కానీ అలా మా ఇంట్లో నా పెళ్లి గురించి ఏమాత్రం ఒత్తిడి లేదు. నీకు ఇష్టమైనప్పుడు పెళ్లి చేసుకోమనే మా వాళ్లు అంటారు. నాకైతే పెళ్లికి ముందే ఒక బేబిని కనాలనిఉంది. భవిష్యత్తులో నాకు అసలు పెళ్లవుతుందో లేదో నాకే క్లారిటీ లేదు.కానీ, ఒక పాపనో, బాబునో పెంచుకోవాలనే కోరిక మాత్రం బలంగా ఉంది. అది అడాప్షన్ ద్వారానో లేదా ఐవీఎఫ్ ద్వారానో ఎలాగైనా సాధ్యమే కదా' అంటూ ఓపెన్ అయింది. అలాగే దాంపత్య జీవితంలో భార్యాభర్తల సమానత్వం గురించి మాట్లాడుతూ.. 'పెళ్లి చేసుకునేది ఉచితంగా వచ్చే పనిమనిషి కోసం కాదు. ఆడపిల్లల బాధ్యత కేవలం వంటింటికే పరిమితం కాకూడదు. బయటకు వెళ్లి అలిసిపోయి ఇంటికి వచ్చాక మహిళ ఒక్కతే వంటింట్లోకి వెళ్లి వంట చేయాల్సి రావడం, పురుషులు విశ్రాంతి తీసుకోవడం సరైన పద్ధతి కాదు. ఇంట్లో పనులను ఇద్దరూ సమానంగా పంచుకోవాలి. కనీసం ఆమెకు తోడుగా నిలిచే భాగ్యస్వామ్యం ఉండాలి' అని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

# రిలీజ్ డేట్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్..




అక్కినేని ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న టైమ్ వచ్చేసింది. అక్కినేని నాగచైతన్య హీరోగా తెరకెక్కుతున్న సోషియో-ఫాంటసీ, మిస్టరీ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ' రిలీజ్ డేట్‌పై ఫైనల్‌గా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు మేకర్స్. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం దసరాకు విడుదల కాబోతున్నట్లు గతంలో టీమ్ అనౌన్స్ చేశారు. ఈ సినిమాలో GFX ఎక్కువగా ఉండటం కారణంగా లేట్ అవుతుందని, ఎట్టిపరిస్థితుల్లోనూ దసరాకు మీ ముందుకు తీసుకొస్తామంటూ అనౌన్స్ చేసినప్పటికీ ఇప్పటి వరకు రిలీజ్ డేట్ ప్రకటించలేదు. ఈ క్రమంలోనే ఫ్యాన్స్ తీవ్ర నిరుత్సాహం వ్యక్తం చేస్తుండగా.. తాజాగా రిలీజ్‌పై అధికారిక ప్రకటన ఇచ్చేశారు. ఈ మేరకు 'సంకేతాలు స్పష్టంగా ఉన్నాయి.. సాహసయాత్ర సమీపిస్తోంది! వృషకర్మ అనే అద్భుత ప్రపంచం వెండితెరపై ఆవిష్కృతవవ్వడానికి ఇంకా 50 రోజులే మిగిలి ఉన్నాయి! ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు, ఇది ఈ సంవత్సరపు అత్యుత్తమ థియేట్రికల్ అనుభూతిని అందించబోతోంది' అని పవర్ ఫుల్ క్యాప్షన్‌తో 'వృషకర్మ' 04 డిసెంబర్ 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్స్‌లోకి రాబోతున్నట్లు ప్రకటించారు. కాగా.. ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా.. 'లాపాతా లేడీస్'ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ్ ప్రధాన విలన్ పాత్రలో కనపించనున్నాడు. 'కాంతార', 'విరూపాక్ష' ఫేమ్ బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నాడు. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర చలనచిత్ర బ్యానర్‌పై బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్నారు.




# నిరీక్షణ ముగిసింది..

హాలీవుడ్‌తో పాటు వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన హర్రర్ థ్రిల్లర్ చిత్రం 'అబ్సెషన్'. మైఖేల్ జాన్సన్, ఇందే నవారెట్టే ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌కు కర్రీ బార్కర్ దర్శకత్వం వహించాడు. కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ 2025లో వచ్చి థియేటర్లలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని ప్రపంచవ్యాప్తంగా రూ.2,500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి సినీ విశ్లేషకులను సైతం విస్మయపరిచింది. అలాంటి ఈ మూవీ ఇప్పుడు డిజిటల్ ప్రేమికుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయింది. 'అబ్సెషన్: ది ఒరిజినల్ అన్‌కట్ వెర్షన్'కు సంబంధించిన ఓటీటీ హక్కులను జియో హాట్‌స్టార్ సొంతం చేసుకోగా.. అక్టోబర్ 30వ తేదీన సాయంత్రం 7 గంటల నుంచి ఇంగ్లీష్‌తో పాటు హిందీ భాషల్లోనూ అందుబాటులోకి రానున్నట్లు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చింది. ఈ మేరకు 'ఇక నిరీక్షణ ముగిసింది.. ఈ హాలోవీన్‌కి ఉన్న ఒక్క కోరిక అన్నీ మార్చేయగలదు' అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుంది.




# భగవంతుడు షూటింగ్ అప్డేట్..

యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్, యంగ్ టాలెంటెడ్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నటిస్తున్న తాజా చిత్రం "భగవంతుడు". ఈ సినిమాలో కన్నడ నటుడు రిషి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని రవి పనస ఫిలిం కార్పొరేషన్ (పనస మీడియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మాత రవి కుమార్ పనస నిర్మిస్తున్నారు. విద్యా శ్రీ పనస సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయవవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న "భగవంతుడు" సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. సినిమా అవుట్‌పుట్ పట్ల చిత్ర బృందం సంతోషంగా ఉంది. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురానున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌తో పాటు లిరికల్ సాంగ్స్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. సినిమా విడుదల కోసం ప్రేక్షకులు, మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ చిత్రంలో రిషి, వినయ్ వర్మ, రవీందర్ విజయ్, షెల్లీ కిషోర్, కాలకేయ ప్రభాకర్, చిరాగ్ జానీ అధిరే అభి, బలగం సంజయ్, హర్షిణి, రవీందర్ రెడ్డి, మైమ్ మధు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# నైజాంను క్లీన్ స్వీప్ చేసిన మైత్రీ!




టాలీవుడ్‌లో అగ్ర నిర్మాణ సంస్థగా వెలుగొందుతున్న మైత్రీ మూవీ మేకర్స్, డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి దిగిన అతి తక్కువ టైంలోనే మార్కెట్‌ను శాసించే స్థాయికి చేరింది. పండుగ రేసులో నిలిచిన ప్రతి భారీ చిత్రాన్ని తమ ఖాతాలోనే వేసుకుంటూ 'మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పీ' నైజాం ఏరియాను దాదాపు క్లీన్ స్వీప్ చేసేసింది. దసరా బరిలో దిగుతున్న క్రేజీ చిత్రాలన్నీ ఒకే సంస్థ ద్వారా విడుదలవుతుండటం ప్రస్తుతం ట్రేడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వారం థియేటర్లలోకి రానున్న బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లన్నీ మైత్రీ బ్యానర్ నుంచే నైజాం బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్నాయి. సూపర్ స్టార్ రజినీకాంత్ మోస్ట్ క్రేజీ సీక్వెల్ 'జైలర్ 2' అక్టోబర్ 15న రిలీజ్ కానుండగా, ఈ సినిమా నైజాం రైట్స్ మైత్రీ సంస్థ వద్దే ఉన్నాయి. ఇక అక్టోబర్ 16న రానున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల పీరియాడిక్ డ్రామా 'రణబాలి', అక్టోబర్ 17న పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన 'గరివిడి లక్ష్మి' చిత్రాల నైజాం పంపిణీ బాధ్యతలను కూడా మైత్రీ సంస్థే చేజిక్కించుకుంది. వరుసగా మూడు రోజుల్లో రాబోయే ఈ మూడు విభిన్న చిత్రాలు ఒకే డిస్ట్రిబ్యూటర్ చేతుల మీదుగా రావడం నైజాం సినిమా చరిత్రలోనే అత్యంత అరుదైన పరిణామంగా చెబుతున్నారు.కొత్త సినిమాలే కాకుండా, ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద నడుస్తున్న 'హనుమాన్ అంశ్', మూడో వారంలోకి అడుగుపెట్టిన 'ది ప్యారడైజ్' కూడా మైత్రీ డిస్ట్రిబ్యూషన్ పరిధిలోనే ఉండటం విశేషం. దీంతో హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక సినిమా థియేటర్స్ మైత్రీ సినిమాలతోనే నిండిపోయాయి. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య 70ఎంఎం, సంధ్య 35ఎంఎం, సుదర్శన్ 35ఎంఎంలతో పాటు దిల్‌సుఖ్‌నగర్ మెగా, ఉప్పల్ రాజలక్ష్మి, బాలానగర్ విమల్ వంటి ప్రముఖ సింగిల్ స్క్రీన్లు అన్నీ మైత్రీ సంస్థ రిలీజ్ చేస్తున్న సినిమాలకే కేటాయించబడ్డాయి. పోటీ ఉన్న చిత్రాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి, థియేటర్లను తమ గుప్పిట్లోకి తీసుకోవడం ద్వారా నైజాం మార్కెట్‌లో తమకు ఎదురులేదని మైత్రీ మరోసారి నిరూపించిందనే కామెంట్స్ సోషల్ మీడియా వేదికగా జోరుగా వినిపిస్తున్నాయి.

# ఈ టాపిక్ ఇక్కడితో ఆపేస్తున్నా..



దేశంలో జరుగుతున్న వివిధ నిరసనలు, ఆందోళనలను ఉద్దేశించి నటుడు బ్రహ్మాజీ సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా పెట్టిన పోస్టులు సంచలనంగా మారాయి. ముఖ్యంగా నీట్ పరీక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను, జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ సాగుతున్న ఉద్యమాలపై స్పందిస్తూ.. 'ప్రస్తుతం నిరసన తెలపడం అనేది ఒక కొత్త వృత్తిగా మారిపోయింది' అని ఆయన పెట్టిన పోస్ట్ నెట్టింట చర్చకు దారి తీయ్యగా.. 'ప్రజా సమస్యలపై, వ్యవస్థల తీరుపై నిరసనలు తెలుపుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజల పోరాటాలను ఆయన చులకన చేస్తున్నాడు' అంటూ పలువురు మండిపడుతున్నారు. తాజాగా దీనిపై స్పందించిన బ్రహ్మాజీ.. 'ప్రతి నిరసన ప్రామాణికమైనది కాదు. కొన్ని నిజమైన వ్యథల నుంచి పుట్టుకొస్తాయి. మరికొన్ని తెరవెనుక ఉన్న స్వార్థపరులైన శక్తుల చేత నిధులు సమకూర్చబడి, నిర్వహించబడి, నిర్దేశించబడుతుంటాయి. నిజమైన అట్టడుగు స్థాయి ఉద్యమాలు గౌరవించదగినవి. కానీ, సృష్టించబడిన నిరసనలు ప్రజలకు కాకుండా కేవలం కొన్ని ఎజెండాలకు మాత్రమే సేవ చేస్తాయి.. ఇక ఈ టాపిక్ ఇక్కడితో ఆపేస్తున్నా' అంటూ రిప్లై ఇచ్చి మరోసారి వార్తల్లో నిలిచాడు బ్రహ్మాజీ.

# పాత్ర ముగింపును బట్టి సక్సెస్ అంచన వేయవద్దు..

యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ పాన్-ఇండియా ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'కరికాల'. 'శంబాల' ఫేమ్ డైరెక్టర్ యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న ఈ మూవీ తాజాగా పూజా కార్యక్రమాలతో ఘనంగా స్టార్ట్ అయింది. ఇందులో హీరోయిన్ కేథరిన్ థ్రెస్సా ఓ కీలక పాత్రలో నటిస్తుండగా.. పూజాకార్యక్రమం సందర్భంగా హీరోయిన్ల పాత్రలపై చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. 'సినీ పరిశ్రమలో నటీమణులను కేవలం హీరోతో చివరికి (సినిమా క్లైమాక్స్) జతకట్టడాన్ని బట్టే జడ్జ్ చేయడం సరైనది కాదు. సినిమా చివరిలో హీరోతో హీరోయిన్ కలిస్తేనే ఆ పాత్ర సక్సెస్ అయినట్లు భావించే పాత ఆలోచనా ధోరణి అసలు మంచిది కాదు. కథలో హీరోయిన్ పాత్రకు ఉన్న ప్రాధాన్యత, ఆమె నటన, కథను మలుపు తిప్పడంలో ఆమె పాత్ర ఎంతవరకు ఉపయోగపడింది అనే విషయాల ఆధారంగానే ఒక నటి సక్సెస్‌ను అంచనా వేయాలి.అంతే కానీ, హీరోతో విడిపోతే పాత్ర బాలేదని, మోసం చేస్తే వేస్ట్ అని అంచనాకు రాకూడదు. నటీమణుల ప్రతిభను, వారు ఎంచుకునే వైవిధ్యమైన పాత్రలను గౌరవించాలే తప్ప, కేవలం సంప్రదాయ ముగింపుల ఆధారంగా వారిని తక్కువ చేసి చూడటం ఆపాలి' అంటూ తెలిపారు. కాగా.. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ 'కరికాల' చిత్రంలో కేథరిన్, సాక్షి అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ పాన్-ఇండియా మూవీ తొలి భాగం 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జులై 2న, అలాగే 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్ 28న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# బర్త్‌డే స్పెషల్‌గా అద్భుతమైన ఆరంభం..




మెగామేనల్లుడు సాయి ధరమ్ తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' సినిమాతో బిజీగా ఉన్నాడు. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా సాయి ధరమ్ తేజ్ బర్త్‌డే సందర్భంగా 'సంబరాల ఏటిగట్టు' నుంచి హీరో పాత్రను రివీల్ చేశారు మేకర్స్. ఇందులో అతడు 'బాలి' అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుపుతూ రిలీజ్ చేసిన పోస్టర్‌లో.. చేతిలో కత్తి, డాలు పట్టుకుని, వెనుక గూడ్స్ రైలు ఉన్నట్లు కనిపించే నేపథ్యంతో తేజ్ యుద్ధవీరుడిలా కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచేశారు. ఇక బర్త్‌డే స్పెషల్‌గా ఈ సినిమాతో పాటు.. ధరమ్ ుాఖ19కు సంబంధించిన అప్డేట్ కూడా వచ్చింది. ఈ మేరకు ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ ఓ ఫొటోను షేర్ చేస్తూ.. 'ఒక కొత్త ప్రయాణం.. ఒక కొత్త సాహసం.. ఒక అద్భుతమైన ఆరంభం! మా ప్రియతమ సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు! ఈ ఏడాది ఆయనకు బ్లాక్‌బస్టర్ కావాలని కోరుకుంటున్నాం.. ఎంతో ఉత్కంఠభరితమైన SDT19 సాహసయాత్ర త్వరలోనే మొదలుకానుంది.. తేజ కాకుమాను దర్శకత్వంలో, అనిల్ సుంకర నిర్మాణంలో, AK ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందనుంది' అంటూ ప్రకటించారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**